thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 131 | జగిత్యాల | గురువారం 13 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## షార్ట్‌కట్ల వెంట పరుగెడితే నష్టమే!



- అర్థవంతమైన మార్గంలోనే ముందుకు సాగాలి
- రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి
- అభిమానించే వ్యక్తుల ఆత్మకథలు చదవండి
- జెన్‌జీకి ప్రధాని సూచన
- కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ

4

## నీట్‌పై చర్చకు సిద్ధం

- ఎంత సమయం కావాలన్నా కేటాయించండి
- సభలోనే ఉండి విపక్షాల ప్రశ్నలకు సమాధానమిస్తా
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అమిత్ షా

4



## నోట్ల కట్టల కేసులో మాజీ జడ్జి దోషి!

- యశ్వంత్ వర్మపై అభియోగాలు నిజమేనని నిర్ధారణ
- పార్లమెంటరీ విచారణలో సంచలన విషయాలు
- భారీ నగదు ఎక్కడిదో చెప్పలేకపోయిన వర్మ



4



# డిఫాల్టర్ మిల్లర్లపై ఉక్కుపాదం

## ఎన్డీఎస్‌ఏ సూచనలు మేరకు నడుచుకోండి

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ సూచనలు పాటించాలి
- దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ముంపు గ్రామాలకు పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలి
- నీటిపారుదల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

2

### బకాయిలు చెల్లించకుంటే మిల్లుల స్వాధీనం

### మహిళా సంఘాలకు అప్పగించే అంశం పరిశీలించండి

### మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు

### బకాయిల వసూళ్లకు ప్రత్యేక విధానం రూపొందించాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

సివిల్ సప్లయిస్ శాఖలో ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుంచి బకాయిలను కఠినంగా వసూలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిఫాల్టర్ల మిల్లులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అవసరమైతే వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో బుధవారం నిర్వహించిన పౌర సరఫరాల శాఖ, నీటిపారుదల శాఖ సమీక్షా సమావేశాల్లో సీఎం ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. రైస్ మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేసిన సీఎం, బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా నూతన విధానాన్ని రూపొందించాలని, కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాల్లో ఐదు నియోజకవర్గాలను ఎంపిక చేసి, మహిళా సంఘాల ద్వారా 50 నుంచి 100 ఎకరాల్లో గోదాముల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని, ఇందుకు ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు.

*- హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు)*

## ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు పెద్దపీట

- జిల్లా కేంద్రాల్లో యువతకు ప్రత్యేక శిక్షణకు కసరత్తు
- సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- వరదలు, విపత్తుల వేళ ఆర్మీ మరింత క్రియాశీలంగా ఉండాలి
- సీఎం రేవంత్ రెడ్డితో లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ భేటీ
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఆర్మీ అధికారి ప్రశంసలు

2



# కొత్త 'ఫ్యామిలీ'కి ఈసీ బ్రేక్!

- ఓటరు జాబితా సవరణలో కొత్త సర్టిఫికెట్లకు నో
- జీవో 172 ప్రకారం మీసేవ జారీ పత్రాలు చెల్లవని స్పష్టీకరణ
- రేషన్ కార్డు వివరాలతో ఇచ్చే ధ్రువపత్రాలను ప్రామాణికంగా గుర్తించలేమన్న ఎన్నికల సంఘం
- జులై 25కు ముందు తహశీల్దార్ విచారణతో జారీ చేసిన వాటికి మాత్రం అంగీకారం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఈసీఐ కార్యదర్శి నవీన్ లేఖ

2




తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లకు కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీవో 172 ప్రకారం మీసేవ కేంద్రాల ద్వారా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో ప్రామాణిక పత్రాలుగా అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.



## జీఆర్ఎంబీ ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

2

## కానిస్టేబుల్ మృతిపై కలకలం

ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జె. సాయికుమార్ మృతి తీవ్ర కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున ఏసీపీ కార్యాలయంలోని విశ్రాంతి గదిలో ఆయన ఉరి వేసుకున్నట్లు పోలీసులు చెబుతుండగా, కుటుంబ సభ్యులు మాత్రం మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, ఆయన శరీరంపై రక్తపు మరకలు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.



- ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో సాయికుమార్ మృతి
- రెస్ట్‌రూమ్‌లో ఉరి వేసుకున్నట్లు పోలీసుల వెల్లడి
- 'ఆత్మహత్య కాదు.. రక్తపు మరకల సంగతేంటి?' అంటూ కుటుంబ సభ్యుల అనుమానం
- పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువులు, కుటుంబ సభ్యుల ఆందోళన
- స్టేషన్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం
- ఉద్రిక్తతతో భారీగా పోలీసుల మోహరింపు

2

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

- 'టీ హబ్' మేం తెస్తే.. 'అనుముల హబ్స్' దోపిడీ!
- మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా కొండల్‌రెడ్డిని ప్రకటించాలంటూ ఎద్దేవా
- ఉద్యోగుల్లేని కంపెనీకి వందల కోట్ల విలువైన భూములెలా వచ్చాయని ప్రశ్న
- 'కుటుంబం నడిపే.. కుటుంబం కోసమే పనిచేసే దోపిడీ' అంటూ విమర్శ

3



## గిరిజనుల నిధులు.. భూముల గోల్‌మాల్!

3 బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్

- రంగనాథ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు
- ఆదేశాలు అమల్లో ఉండగానే కూల్చివేతలపై ఆగ్రహం
- వాణి కో-ఆపరేటివ్ సొసైటీ వ్యవహారం సుమోటోగా స్వీకరణ
- రెవెన్యూ నివేదిక లేకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని ప్రశ్న
- సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశం
- తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా




2






# కొత్త 'ఫ్యామిలీ'కి ఈసీ బ్రేక్!

**ఓటరు జాబితా సవరణలో కొత్త సర్టిఫికెట్లకు నో**

**జీవో 172 ప్రకారం మీసేవ జారీ పత్రాలు చెల్లవని స్పష్టీకరణ**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఈసీఐ కార్యదర్శి నవీన్ లేఖ**

**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లకు కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీవో 172 ప్రకారం మీసేవ కేంద్రాల ద్వారా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో ప్రామాణిక పత్రాలుగా అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీకి తహశీల్దార్ స్థాయిలో క్షేత్రస్థాయి విచారణ జరిగేదని ఎన్నికల సంఘం పేర్కొంది. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు సంబంధిత పత్రాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాతే ధ్రువపత్రాలు జారీ చేసేవారని తెలిపింది. అయితే జీవో 172 అమల్లోకి వచ్చిన తర్వాత ఈ విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొంది. కొత్త విధానంలో ముందస్తు క్షేత్రస్థాయి విచారణ లేకుండానే రేషన్ కార్డులోని వివరాల ఆధారంగా మీసేవ ద్వారా రెండు రోజుల్లో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయని ఈసీఐ తెలిపింది. దీంతో వాటిని స్వతంత్రంగా ధ్రువీకరించిన పత్రాలుగా కాకుండా రేషన్ కార్డుతో సమానమైన ఆధారంగానే పరిగణించాల్సి వస్తుందని వివరించింది. రేషన్ కార్డు పౌరసత్వాన్ని నిర్ధారించే నిశ్చయాత్మక ఆధారం కాదని, ఓటరు జాబితా పరిశీలనలో దానిని ప్రామాణిక పత్రంగా పరిగణించలేమని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ఎన్నికల సంఘం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో జీవో 172 కింద కొత్తగా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ప్రత్యేక సమగ్ర సవరణలో గుర్తింపు పత్రాలుగా స్వీకరించబోమని స్పష్టం చేసింది. అయితే పాత విధానంలో జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల విషయంలో మాత్రం ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. జీవో 172 అమల్లోకి రాకముందు, అంటే జులై 25, 2026కు ముందు తహశీల్దార్ క్షేత్రస్థాయి విచారణ, పత్రాల పరిశీలన అనంతరం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అంగీకరిస్తామని స్పష్టం చేసింది. దీంతో కొత్తగా మీసేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు పొందుతున్న వారు వాటిని ఓటరు జాబితా సవరణకు ప్రామాణిక పత్రాలుగా వినియోగించే అవకాశం లేకుండా పోయింది.

# పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ఆమోదం

**హైదరాబాద్, ఆగస్ట్ 12 (చురకలు) :** తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, పేర్ల మార్పులకు ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదించింది. కొన్ని పోలింగ్ స్టేషన్ల తొలగింపు, విలీనానికి కూడా అనుమతి ఇచ్చింది. ఆయా జిల్లాల వారీగా పోలింగ్ స్టేషన్ల మార్పుల జాబితాను ఈసీ విడుదల చేసింది. పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పునకు కూడా ఆమోదించింది. ఈ మార్పుల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఈసీ ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ సీఈఓ కార్యాలయం బుధవారం మెమో జారీ చేసింది.

# జీఆర్ఎంబీ ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

**ప్రాజెక్టులపై మూడు అంశాలు తొలగించాలని డిమాండ్**

**సమ్మక్క బ్యారేజీ అనుమతుల అంశాన్ని చర్చించొద్దని స్పష్టీకరణ**

**చర్చించిన అంశాలనే మళ్లీ తెరపైకి తెచ్చారని అభ్యంతరం**

**సవరించిన ఎజెండా విడుదల చేయాలంటూ జీఆర్ఎంబీకి లేఖ**



**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు): గోదావరి** నదీ యాజమాన్య బోర్డు సమావేశ ఎజెండాపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నెల 18న జరగనున్న జీఆర్ఎంబీ 18వ సమావేశ ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన మూడు అంశాలను చేర్చడాన్ని తప్పుబట్టింది. ఇప్పటికే చర్చించి స్పష్టత వచ్చిన అంశాలను మరోసారి ఎజెండాలో పెట్టాల్సిన అవసరం లేదని పేర్కొంటూ వాటిని తొలగించాలని బోర్డును కోరింది. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు నిలిపివేయాలనే అంశాన్ని ఎజెండా నుంచి తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు సాంకేతిక సలహా కమిటీ ఇచ్చిన అనుమతుల వివరాలకు సంబంధించిన అంశాన్ని కూడా చర్చకు తీసుకురావద్దని కోరింది. కేంద్ర జల సంఘంతో పాటు ఇతర సంస్థలు తెలంగాణ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను సమీక్షించాలన్న అంశంపైనా అభ్యంతరం తెలిపింది. ఈ మూడు అంశాలపై గతంలోనే జీఆర్ఎంబీ సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగిందని తెలంగాణ ప్రభుత్వం గుర్తుచేసింది. తెలంగాణ ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ గతంలో లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్ర జల సంఘం పరిశీలించి తిరస్కరించిందని పేర్కొంది. కేంద్ర జల సంఘం అవార్డు, అమల్లో ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆయా ప్రాజెక్టులకు అనుమతులు లభించాయని స్పష్టం చేసింది. ఇప్పటికే పరిష్కారమైన అంశాలను మళ్లీ సమావేశ ఎజెండాలో చేర్చడం సరికాదని పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం.. మూడు అంశాలను వెంటనే తొలగించి సవరించిన ఎజెండాను విడుదల చేయాలని జీఆర్ఎంబీకి లేఖ రాసింది. ఇదిలావుంటే జీఆర్ఎంబీ సమావేశ ఎజెండాపై మాజీ మంత్రి హరీశ్‌రావు వారం క్రితమే అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన ఇలాంటి అంశాలను ఎజెండాలో చేర్చడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా అంగీకరిస్తుందని ఆయన ప్రశ్నించారు.

# డిఫాల్టర్ మిల్లర్లపై ఉక్కుపాదం

- బకాయిలు చెల్లించకుంటే మిల్లుల స్వాధీనం
- మహిళా సంఘాలకు అప్పగించే అంశం పరిశీలించండి
- మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు
- బకాయిల వసూళ్లకు ప్రత్యేక విధానం రూపొందించాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** పౌరసరఫరాల శాఖకు బకాయిపడిన డిఫాల్టర్ రైస్ మిల్లర్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించకుండా డిఫాల్ట్ అయిన మిల్లులను స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో పౌరసరఫరాల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సీఎం సూచించారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. ధాన్యం దిగుబడి అధికంగా ఉండే ఐదు నియోజకవర్గాలను ఎంపిక చేసి మహిళా సంఘాల ఆధ్వర్యంలో 50 నుంచి 100 ఎకరాల్లో గోదాముల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని సూచించారు. గోదాముల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు.

# ఆర్మీ నియామకాల్లో యువతకు పెద్దపీట

- జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణకు కసరత్తు
- సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- వరదలు, విపత్తుల వేళ ఆర్మీ మరింత క్రియాశీలంగా ఉండాలి
- సీఎం రేవంత్ రెడ్డితో లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్ భేటీ
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఆర్మీ అధికారి ప్రశంసలు



**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** భారత సైన్యంలో జరిగే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతకు మరిన్ని అవకాశాలు దక్కేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఆర్మీ నియామకాలకు సిద్ధమయ్యే యువతకు జిల్లా కేంద్రాల్లో ముందస్తు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మీ నియామకాలు, తెలంగాణ యువతకు శిక్షణ, విపత్తు నిర్వహణలో సైన్యం సహకారం తదితర అంశాలపై చర్చించారు. ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు ఎక్కువ అవకాశాలు లభించేలా రాష్ట్ర ప్రభుత్వం, సైన్యం సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ఆసక్తి, అనుకూల పరిస్థితులు ఉన్న జిల్లా కేంద్రాలను గుర్తించి యువతకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా జరిగే వివిధ ఆర్మీ నియామకాలకు ముందుగానే తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలత వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరదలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యల్లో ఆర్మీ మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని సీఎం కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను రక్షించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కార్యక్రమాల్లో సైన్యం సహకారాన్ని మరింత పెంచాలని సూచించారు. తెలంగాణలో విపత్తులు సంభవించినప్పుడు ప్రత్యేక చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులకు సూచనలు చేస్తామని రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ అభినందించారు. హైదరాబాద్ నగర పరిరక్షణ, కాలుష్య నియంత్రణతో పాటు మూసీకి చారిత్రక వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావుతో పాటు పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్డీఎస్ఏ సూచనలు మేరకు నడుచుకోండి

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల సీఎం దిశా నిర్దేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 12 (చురకలు) :** గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోయాలని దిశానిర్దేశర చేశారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలని సీఎం ఆదేశించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్లలోనూ లోపాలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. దేవాదుల నుంచి 9 పంపులతో ఎత్తిపోతల చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టుల కింద పెండింగ్‌లో ఉన్న పరిహారం, పునరావాస చెల్లింపులు వేగవంతం చేయాలని సూచించారు. ముంపు గ్రామాలపై అధికారులు క్షేత్రస్థాయి వాస్తవ నివేదిక ఇవ్వాలని నిర్దేశిరచారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ పరిహారం పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉందని వివరించారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపుపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్

**రంగనాథ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు**

**ఆదేశాలు అమల్లో ఉండగానే కూల్చివేతలపై ఆగ్రహం**


**తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా**

**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న వ్యవహారంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. వాణి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన భవనాల కూల్చివేత అంశాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి రంగనాథ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం ముందస్తుగా ఇచ్చిన ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా యంత్రాలతో కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పుడు వాటికి విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించింది. కేసు విచారణ సందర్భంగా రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అధికారిక సూచనలు లేదా నివేదికలు లేకుండానే హైడ్రా అధికారులు ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని బాధితుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కూల్చివేతలకు దారితీసిన పరిస్థితులు, అధికారుల వద్ద ఉన్న ఆధారాలపై ఆరా తీసింది. కమిషనర్ రంగనాథ్ తీసుకున్న చర్యల కారణంగా ఇతర ప్రభుత్వ అధికారులు కూడా ఇప్పుడు కోర్టు ముందు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి నిజానిజాలను తేల్చేందుకు వివాదాస్పద స్థలానికి సంబంధించిన సమగ్ర నివేదికను న్యాయస్థానానికి సమర్పించాలని సంబంధిత జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. కూల్చివేతలకు ముందు రెవెన్యూ పరంగా జరిగిన ప్రక్రియ, అందుబాటులో ఉన్న రికార్డులు తదితర వివరాలను నివేదికలో పొందుపరచాలని సూచించింది. అనంతరం కేసు తదుపరి విచారణను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేసింది. దీంతో కలెక్టర్ సమర్పించే నివేదిక, రంగనాథ్‌కు జారీ చేసిన ధిక్కరణ నోటీసులపై తదుపరి విచారణలో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# కానిస్టేబుల్ మృతిపై కలకలం



- ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో సాయికుమార్ మృతి
- రెస్ట్‌రూమ్‌లో ఉరి వేసుకున్నట్లు పోలీసుల వెల్లడి
- 'ఆత్మహత్య కాదు.. రక్తపు మరకల సంగతేంటి?' అంటూ కుటుంబ సభ్యుల అనుమానం
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- స్టేషన్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం
- ఉద్రిక్తతతో భారీగా పోలీసుల మోహరింపు



**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు):** ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జె. సాయి కుమార్ మృతి తీవ్ర కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున ఏసీపీ కార్యాలయంలోని విశ్రాంతి గదిలో ఆయన ఉరి వేసుకున్నట్లు పోలీసులు చెబుతుండగా, కుటుంబ సభ్యులు మాత్రం మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, ఆయన శరీరంపై రక్తపు మరకలు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2024 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ జె. సాయికుమార్ ప్రస్తుతం ఈ-కాప్స్ విధుల కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్నారు. రాత్రి విధుల్లో ఉన్న ఆయన బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కార్యాలయంలోని విశ్రాంతి గదిలో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించారు. సిబ్బంది వెంటనే సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సాయికుమార్ కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన మృతికి దారితీసిన కారణాలు ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు సాయికుమార్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకున్నాడన్న పోలీసుల వాదనను వారు ప్రశ్నించారు. 'ఆత్మహత్య అయితే రక్తపు మరకలు ఎలా వచ్చాయి? అసలు ఏం జరిగింది?' అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో కొందరు పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్‌ను ధ్వంసం చేసినట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. సాయికుమార్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం



- 'టీ హబ్' మేం తెస్తే.. 'అనుముల హబ్స్' దోపిడీ!
- మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా కొండల్‌రెడ్డిని ప్రకటించాలంటూ ఎద్దేవా
- ఉద్యోగుల్లేని కంపెనీకి వందల కోట్ల విలువైన భూములెలా వచ్చాయని ప్రశ్న
- 'కుటుంబం నడిపే.. కుటుంబం కోసమే పనిచేసే దోపిడీ' అంటూ విమర్శ

**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుల భూకుంభకోణం నిజమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరోసారి ఆరోపించారు. తెలంగాణలో నిజమైన అంకుర సంస్థలు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని తాము 'టీ హబ్'ను నిర్మిస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన కేటీఆర్.. అనుముల కొండల్‌రెడ్డిని 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా ప్రకటించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఉద్యోగులు లేకున్నా, భారీ పెట్టుబడులు కనిపించకున్నా వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఎలా దక్కుతున్నాయని ప్రశ్నించారు. టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ పేరుతో రక్షణ రంగ కంపెనీని ఏర్పాటు చేసి, వందల కోట్ల విలువైన భూమిని పొందడం వెనుక ఉన్న 'వ్యాపార నమూనా' ఏమిటో తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో యువతకు శిక్షణ ఇవ్వండి. ఈ అద్భుత అవకాశం కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికీ ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒకవైపు నిజమైన అంకుర సంస్థలకు అవకాశాలు కల్పించేందుకు గత ప్రభుత్వం టీ హబ్ వంటి వ్యవస్థలను నిర్మిస్తే.. ఇప్పుడు కుటుంబ ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇది 'కుటుంబం నడిపే.. కుటుంబం కోసమే పనిచేసే.. ఆవిష్కరణలు లేని.. ఉద్యోగులు లేని వ్యవహారం' అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అనుముల కుటుంబ సభ్యుడైతే చాలు.. ఎలాంటి ప్రశ్నలు లేకుండానే వందల కోట్ల విలువైన భూములు దక్కించుకోవచ్చా అని కేటీఆర్ ప్రశ్నించారు. భూ కేటాయింపుల వ్యవహారంపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# గిరిజనుల నిధులు.. భూములు గోల్‌మాల్!

- ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.2,730 కోట్లు కేటాయించి.. ఖర్చు చేసింది రూ.70 కోట్లేనని హరీశ్‌రావు ఆరోపణ
- బీఆర్ఎస్ హయాంలో 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి రాజ్యాధికారం కల్పించామని వెల్లడి
- ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చి గిరిజనులను రైతులుగా మార్చామని వ్యాఖ్య
- కాంగ్రెస్ వచ్చాక గిరిజనుల భూములను గుంజుకుంటోందని విమర్శ
- 'యువత ఉద్యోగాలు వెతకడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి' అని పిలుపు



**సిద్దిపేట, ఆగస్టు 12 (చురకలు):** గిరిజనుల సంక్షేమానికి బడ్జెట్‌లో వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ నిధులను ఖర్చు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.2,730 కోట్లు కేటాయించామని ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిందని, అందులో ఖర్చు చేసింది కేవలం రూ.70 కోట్లు మాత్రమేనని విమర్శించారు. నిధులే కాకుండా గిరిజనుల భూముల విషయంలోనూ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట జిల్లా చాప్టర్ ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజన యువత ఉద్యోగాల కోసం వెతికే వారిగా కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గిరిజన యువతకు వ్యాపార అవకాశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పిస్తున్న సంస్థ కృషిని ఆయన అభినందించారు. గిరిజన యువతకు మార్గదర్శకంగా ఉండటంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే వేదికగానూ పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేశామని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజన బిడ్డలు సర్పంచులుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచామని గుర్తుచేశారు. గిరిజన మహిళల కోసం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు, విద్యార్థుల కోసం గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించామని తెలిపారు. ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులను రైతులుగా మార్చామని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులు ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకపోతే మరుసటి ఏడాదికి కొనసాగించేలా ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేశామని చెప్పారు.

### రూ.2,730 కోట్లు ఎక్కడ.. రూ.70 కోట్లు ఎక్కడ?

ప్రస్తుత ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిందని హరీశ్‌రావు విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.2,730 కోట్లు కేటాయించినట్లు చెప్పి కేవలం రూ.70 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులను బడ్జెట్‌లో చూపిస్తున్నా సగం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి రూ.10 వేలు, పీజీ పూర్తి చేసిన వారికి రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు భూములపై హక్కులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటోందని హరీశ్‌రావు ఆరోపించారు. గిరిజనుల భూములను లాక్కొని ముఖ్యమంత్రి కుటుంబానికి సన్నిహితులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. లగచర్లలో భూములు ఇవ్వబోమని చెప్పిన గిరిజనులకు బేడీలు వేసే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.

### ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగదాతలు కావాలి

గిరిజన యువత పారిశ్రామిక రంగంలోకి రావాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన రమేష్ నాయక్ లండన్‌లో 16 హోటళ్లు స్థాపించి వ్యాపారవేత్తగా ఎదిగారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీ-ప్రైడ్ ద్వారా సహకారం పొందిన సురేష్ నాయక్ హైదరాబాద్‌లో కేకుల తయారీ రంగంలో పెద్ద సంస్థలతో పోటీపడుతున్నారని తెలిపారు. ఇలాంటి విజయగాథలను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూసే స్థాయి నుంచి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న గిరిజనుల సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలను సాధించేందుకు ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మరింత చురుగ్గా పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు.

# హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- హెచ్ఐవీ/ఎయిడ్స్, సిఫిలిస్‌పై విస్తృత ప్రచారం అవసరం
- రవాణా శాఖ మంత్రి పొన్నం




**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** తెలంగాణను హెచఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, సిఫిలిస్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు, వ్యక్తుల్లో స్వీయ ప్రమాద అంచనాను పెంపొందించి, స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు రెండు నెలలపాటు నిర్వహించనున్న ప్రచార కార్యక్రమం హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం నుంచి అక్టోబర్ 12వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం, ముందస్తుగా గుర్తించడం, సరైన వైద్య సలహాలు పొందడం, సకాలంలో చికిత్స తీసుకోవడం వ్యాధి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎయిడ్స్ బారిన పడిన వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదని మంత్రి సూచించారు. వారికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో అండగా నిలవాలని కోరారు.

### భారీ ర్యాలీలు

ప్రచారంలో భాగంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ ప్రాంతంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బైక్ ర్యాలీని మంత్రి పొన్నం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆటో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీల్లో నర్సింగ్, వైద్య కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అమలవుతున్న టార్గెటెడ్ ఇంటర్వెన్షన్, లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్టుల సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. అనంతరం వాకథాన్‌లో 1,600మందికిపైగా పాల్గొన్నారు. ర్యాలీ, వాకథాన్‌లో పాల్గొన్న వారు హెచ్ఐవీ/ఎయిడ్స్, సిఫిలిస్ నివారణకు సంబంధించిన సందేశాలు, నినాదాలతో కూడిన ప్లకార్డులు, హెచఐవీ/ఎయిడ్స్ లోగో, క్యూఆర్ కోడ్‌లతో ఉన్న గొడుగులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

### హెచ్ఐవీ నివారణలో తెలంగాణ పురోగతి

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విద్యాసాగర్ రాష్ట్రంలో హెచ్ఐవీ నివారణ, పరీక్షలు, చికిత్సకు సంబంధించి అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరించారు. 2025-26 జాతీయ స్కోర్ కార్డులో తెలంగాణ 5వ స్థానాన్ని సాధించిందని, 2023లో ఉన్న 31వ స్థానం నుంచి గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీపై అపోహలను తొలగించి శాస్త్రీయ అవగాహనతో వ్యాధిని ఎదుర్కొనేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ యువత హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని, వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. హెచ్ఐవీపై ప్రామాణిక సమాచారం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1097ను సంప్రదించాలని, అందుబాటులో ఉన్న నివారణ, పరీక్షలు, చికిత్స సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమం ముగింపులో టీజీఎస్ఏసీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు, ప్రముఖులను సత్కరించారు. బెలూన్లను ఎగరేసి రెండు నెలల ప్రచార కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

### ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళు ్లగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 12 (చురకలు) :** రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రెండున్నరేళ్లలో వ్యవసాయ రంగానికి రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా సచివాలయంలో బుధవారం మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పంటల వైవిధ్యీకరణ, ఉత్తమ విధానాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న డిజిటల్ వ్యవసాయ సేవలు, క్రాప్ బుకింగ్, 'కృషివాస' ఏఐ ప్లాట్‌ఫామ్, రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ఆయిల్‌పామ్ సాగు విధానాలను బీహార్ మంత్రికి తుమ్మల వివరించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు ముమ్మరంగా సాగుతుండటంతో ఆ సాంకేతికతను అధ్యయనం చేసేందుకు బీహార్ ఆసక్తి చూపగా, బీహార్‌లో విస్తృతంగా పండే 'మకానా' సాగు, బోర్డు నిర్వహణ, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేయడానికి తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల ప్రతినిధులు, రైతుల బృందాల పరస్పర అధ్యయన పర్యటనలకు మంత్రులు అంగీకారం తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన 'అర్బన్ ఫార్మింగ్ అండ్ కిచెన్ గార్డెనింగ్ ఎక్స్‌పో-2026'లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. నగర ప్రజలు తమ ఇళ్ల బాల్కనీలు, టెర్రస్‌లలో కూరగాయలు, ఆకుకూరలు పెంచుకోవడం ద్వారా తాజా, ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని సూచించారు. "తాజాగా పండిద్దాం-ఆరోగ్యంగా తిందాం-పచ్చగా జీవిద్దాం" అనేది ప్రతి ఒక్కరి జీవన విధానంగా మారాలని మంత్రి పిలుపునిచ్చారు.



## సంపాదకీయం



# డీలిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమిటి?

**ప్రజా సమస్యలు పక్కన.. రాజకీయ లెక్కలకే ప్రాధాన్యమా?**

**పార్లమెంట్‌లో చర్చలకన్నా నినాదాలే ఎక్కువ**

**ప్రజల మనసెరిగి పాలిస్తేనే ప్రజాస్వామ్యానికి గౌరవం**

కాలానుగుణంగా నడుచుకోవడం.. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం పాలకుల ప్రథమ కర్తవ్యం. ప్రజల మనసెరిగి పాలన సాగించినవారే చరిత్రలో నిలిచారు. ప్రజల సమస్యలను విస్మరించి నిరంకుశంగా వ్యవహరించిన పాలకులు కాలగర్భంలో కలిసిపోయారు. ప్రజాస్వామ్యంలో అయితే ఈ బాధ్యత మరింత ఎక్కువ. ఎందుకంటే పాలకులైనా, ప్రతిపక్షాలైనా ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులే. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన బాధ్యత రెండువర్గాలపైనా సమానంగా ఉంటుంది. కానీ, ఇటీవల పార్లమెంట్ సమావేశాల తీరు చూస్తుంటే ప్రజల సమస్యలకన్నా రాజకీయ పోరాటాలే ముందుకొస్తున్నాయన్న భావన కలుగుతోంది. సభ ప్రారంభం కావడం.. విపక్షాలు నినాదాలు చేయడం.. వెల్‌లోకి దూసుకెళ్లడం.. స్పీకర్ వారించడం.. చివరకు సభ వాయిదా పడటం నిత్యకృత్యంగా మారింది. మరోవైపు అధికార పక్ష సభ్యులు కూడా సభ వెలుపల ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగుతున్నారు. ఫలితంగా ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలు చర్చకు రావడం లేదు. పార్లమెంట్‌లో అధికార పక్షం తమకు నచ్చిన బిల్లులను ఆమోదింపజేసుకోవాలని చూస్తే.. విపక్షాలు వాటిపై చర్చించి లోపాలను ఎత్తిచూపాలి. అవసరమైతే సవరణలు సూచించాలి. ప్రజలకు ఉపయోగపడే ప్రత్యామ్నాయాలను ముందుకు తేవాలి. అదే ప్రజాస్వామ్య వ్యవస్థకు అందం. కానీ సభను స్తంభింపజేయడమే రాజకీయ వ్యూహంగా మారితే నష్టపోయేది ప్రజలే. పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు ప్రజాధనం ఖర్చవుతుంది. ఆ సమయాన్ని నినాదాలు, వాయిదాలతో వృథా చేయడం అధికార, ప్రతిపక్షాల రెండింటి బాధ్యతారాహిత్యానికే నిదర్శనం. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై విపక్షాలు కేంద్రాన్ని నిలదీస్తున్నాయి. అదే సమయంలో జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను అధికార పక్షం ప్రస్తావిస్తోంది. ఇరువర్గాలూ ఒకరినొకరు తప్పుబట్టడంలో చూపుతున్న ఆసక్తిని విద్యార్థుల సమస్య పరిష్కారంలో చూపితే మరింత ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం కూడా మళ్లీ రాజకీయ చర్చల్లోకి వచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగపరమైన ప్రక్రియ కావచ్చు. జనాభా మార్పులు, ప్రాతినిధ్య సమతుల్యత వంటి అంశాలు దాని వెనుక ఉండవచ్చు. కానీ సాధారణ ప్రజల దృష్టిలో ఇప్పుడు అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్య ఇదేనా అన్న ప్రశ్న తప్పకుండా వస్తుంది. ఎంపీల సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు ప్రత్యక్షంగా ఎంత ప్రయోజనం కలుగుతుందన్నదానిపై సమగ్ర చర్చ అవసరం. అదనపు నియోజకవర్గాలు, అదనపు ప్రజాప్రతినిధులు, మరిన్ని కార్యాలయాలు అంటే ప్రభుత్వ ఖర్చు కూడా పెరుగుతుంది. ఆర్థిక భారం పెరుగుతున్న సమయంలో ఈ ప్రక్రియ వల్ల ప్రజలకు కలిగే స్పష్టమైన ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం వివరించాల్సిన బాధ్యత ఉంది. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచాల్సిన అవసరంపై దాదాపు అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. అలాంటప్పుడు మహిళా రిజర్వేషన్ అమలును డీలిమిటేషన్ వంటి దీర్ఘకాలిక ప్రక్రియలకు అనుసంధానం చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న వస్తోంది. ప్రస్తుత పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పరిధిలోనే మహిళలకు రిజర్వేషన్ అమలు చేసే మార్గాలను పరిశీలించవచ్చు. మహిళా ప్రాతినిధ్యం పెంపు నిజంగా లక్ష్యమైతే ఆలస్యం కాకుండా అమలు దిశగా రాజకీయ సంకల్పం చూపాలి. దేశంలో నిరుద్యోగం యువతను తీవ్రంగా కలవరపెడుతోంది. పోటీ పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రశ్నపత్రాల లీకులు, నియామకాల్లో అవకతవకలు, పరీక్షల వాయిదాలతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇటువంటి సమస్యలు పరిష్కరించకుండా రాజకీయ వివాదాలకే ప్రాధాన్యం ఇస్తే యువతలో అసంతృప్తి పెరగడం సహజం. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచాలి. లీకులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంచాలి. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను సమయపాలనతో నిర్వహించాలి. ఇవే యువత ఆశిస్తున్న చర్యలు. సామాన్య ప్రజలను రోజువారీగా ఇబ్బంది పెడుతున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. వైద్య ఖర్చులు సామాన్య కుటుంబాలకు భారమవుతున్నాయి. సైబర్ మోసాలు విస్తరిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో రైతులు గిట్టుబాటు ధర, పెట్టుబడి వ్యయాలు, మార్కెటింగ్ సమస్యలతో సతమతమవుతున్నారు. ఇవి పార్లమెంట్‌లో గంటల తరబడి చర్చించాల్సిన అంశాలు. ప్రభుత్వ విధానాలు ఏమిటి? విపక్షాల ప్రత్యామ్నాయాలు ఏమిటి? ప్రజలకు ఏం చేయబోతున్నారు? అన్నదానిపై చర్చ జరగాలి. కానీ రాజకీయ నినాదాల మధ్య అసలు సమస్యలు మరుగునపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికారానికి శాశ్వతత్వం ఉండదు. ప్రజల విశ్వాసమే పాలకులకు నిజమైన బలం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినప్పుడు మాత్రమే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. అదే విధంగా ప్రతిపక్షాలు కూడా ప్రతి అంశాన్ని రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాల కోణంలో చూడాలి. డీలిమిటేషన్ వంటి రాజకీయంగా సున్నితమైన అంశాలను తొందరపాటు నిర్ణయాలతో కాకుండా విస్తృత సంప్రదింపులతో ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాల ప్రయోజనాలు, జనాభా నియంత్రణలో మెరుగైన పనితీరు కనబరిచిన ప్రాంతాల ఆందోళనలు, సమాఖ్య స్ఫూర్తి అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజలకు ఇప్పుడవసరమైనది మరిన్ని రాజకీయ పోరాటాలు కాదు.. సమస్యలకు పరిష్కారాలు. మరిన్ని నినాదాలు కాదు.. ఉపాధి అవకాశాలు. మరిన్ని వాయిదాలు కాదు.. పనిచేసే పార్లమెంట్. డీలిమిటేషన్ రాజకీయ అవసరం కావచ్చు.. కానీ ప్రజల జీవితాల్లో వెలుగు నింపే నిర్ణయాలే పాలకులకు అసలు ప్రాధాన్యం కావాలి.

# షార్ట్‌కట్ల వెంట పరుగెడితే నష్టమే!

- అర్థవంతమైన మార్గంలోనే ముందుకు సాగాలి
- రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి
- అభిమానించే వ్యక్తుల ఆత్మకథలు చదవండి
- జెన్‌జీ యువతకు ప్రధాని మోదీ సూచన
- రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** జీవితంలో త్వరగా ఎదగాలనే ఆరాటంతో షార్ట్‌కట్ల వెంట పరుగెత్తడం మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ యువతకు సూచించారు. వేగంగా గమ్యాన్ని చేరుకోవాలనే ప్రయత్నంలో తప్పుడు మార్గాలను ఎంచుకుంటే చివరకు నష్టపోయే ప్రమాదమే ఎక్కువని హెచ్చరించారు. ముఖ్యంగా జెన్‌జీ యువత అర్థవంతమైన మార్గాన్ని ఎంచుకుని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ సందర్భంగా మోదీ మాట్లాడారు. జీవితంలో షార్ట్‌కట్ల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరిస్తూ రైల్వే స్టేషన్లను ఉదాహరణగా ప్రస్తావించారు. కొందరు సమయం ఆదా చేసుకోవాలనే ఉద్దేశంతో ఫుట్‌బ్రిడ్జిని ఉపయోగించకుండా నేరుగా రైల్వే పట్టాలు దాటుతుంటారని, అలాంటి వారిని హెచ్చరించేందుకు ఏర్పాటు చేసే బోర్డుల్లోనూ జీవితానికి ఉపయోగపడే సందేశం దాగి ఉంటుందని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతి అంశాన్నీ గుడ్డిగా అనుసరించవద్దని యువతకు సూచించారు. మన ఆలోచనలను ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జీవితంలో ముందుకు వెళ్లేందుకు సరైన మార్గం కావాలనుకుంటే తాము అభిమానించే, స్ఫూర్తిగా భావించే వ్యక్తుల ఆత్మకథలను చదవాలని సూచించారు. వాటి ద్వారా వారు ఎదుర్కొన్న కష్టాలు, చేసిన పోరాటాలు, విజయానికి అనుసరించిన మార్గాలను తెలుసుకోవచ్చన్నారు. ఇటీవలి కాలంలో యువతకు మరింత చేరువయ్యేలా మోదీ సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. యువతకు చేరువయ్యే భాష, వీడియోల ద్వారా సందేశాలు ఇస్తూనే.. సామాజిక మాధ్యమాలు, రీల్స్‌కే పరిమితం కాకుండా చదువు, నైపుణ్యాలు, కెరీర్‌పై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

**కోవింద్ జీవితం యువతకు స్ఫూర్తి**

ఇదే కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథను మోదీ ఆవిష్కరించారు. కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఆయన.. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' దిశగా కోవింద్ చేసిన కృషిని కూడా మోదీ ప్రశంసించారు. ఆయన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కోవింద్ జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, పోరాటాలు, సాధించిన విజయాల నుంచి యువత ఎంతో నేర్చుకోవచ్చన్నారు. కోవింద్ పోరాటాలు వ్యక్తిగతమైనవైనా.. ఆయన సాధించిన విజయం భారత గణతంత్రం, ప్రజాస్వామ్య విజయానికి ప్రతీకగా నిలిచిందని మోదీ అభివర్ణించారు. అందుకే 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్' అనే శీర్షిక ఈ ఆత్మకథకు ఎంతో సముచితమని పేర్కొన్నారు.

# నీట్‌పై చర్చకు సిద్ధం

- పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్రం సై
- ఎంత సమయం కావాలన్నా కేటాయించండి
- సభలోనే ఉండి విపక్షాల ప్రశ్నలకు సమాధానమిస్తా
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అమిత్ షా లేఖ
- చర్చలు, సంభాషణలతోనే సమస్యలకు పరిష్కారమని వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నీట్ పరీక్ష వివాదం, విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ అంశంపై విపక్షాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో అవసరమైన సమయాన్ని కేటాయించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాశారు. చర్చ జరిగే సమయంలో తాను స్వయంగా సభలో ఉండి విపక్ష సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానమిస్తానని తెలిపారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోనే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వం తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకారం తెలిపారని అమిత్ షా గుర్తుచేశారు. ప్రస్తుత సమావేశాల్లోనే 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026'పై సుదీర్ఘ చర్చ జరిగిందని పేర్కొన్నారు. ఆ సమయంలో విపక్షానికి చెందిన ఏ ఎంపీ కూడా నీట్ అంశాన్ని ప్రస్తావించలేదని తెలిపారు. అయినప్పటికీ విద్యార్థులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మరోసారి ప్రత్యేకంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విపక్ష నేతలతో సంప్రదింపులు జరిపి నీట్ అంశంపై చర్చకు ఎంత సమయం అవసరమని భావిస్తే అంత సమయం కేటాయించాలని స్పీకర్‌ను కోరారు. కేటాయించిన సమయంలో తాను సభలోనే ఉండి చర్చలో పాల్గొంటానని, విపక్షాలు లేవనెత్తే ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో సమస్యలకు చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కారాలు లభిస్తాయని అమిత్ షా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థలపై తనకు అపారమైన విశ్వాసం ఉందని, సభ కూడా చర్చలు, అభిప్రాయాల మార్పిడి కోసమేనని చెప్పారు. అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ తమ అభిప్రాయాలను వెల్లడించేలా సానుకూల వాతావరణంలో చర్చ జరిగేందుకు చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు.

# నోట్ల కట్టల కేసులో మాజీ జడ్జి దోషి!

**యశ్వంత్ వర్మపై అభియోగాలు నిజమేనని నిర్ధారణ**

**పార్లమెంటరీ విచారణలో సంచలన విషయాలు**

**భారీ నగదు ఎక్కడిదో చెప్పలేకపోయిన వర్మ**



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై మోపిన అభియోగాలు నిజమేనని లోక్‌సభ ఏర్పాటు చేసిన విచారణ ప్యానెల్ నిర్ధారించింది. నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరిది? ఎంత మొత్తం ఉంది? అనే కీలక ప్రశ్నలకు వర్మ నుంచి విశ్వసనీయమైన సమాధానాలు రాలేదని ప్యానెల్ తేల్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ నివాసంలో యశ్వంత్ వర్మ ఉంటున్న సమయంలో గత ఏడాది మార్చి 14-15 తేదీల మధ్య అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం బయటకు వచ్చిన కొన్ని చిత్రాల్లో స్టోర్‌రూమ్‌లో భారీగా రూ.500 నోట్ల కట్టలు కనిపించడం తీవ్ర సంచలనం సృష్టించింది. వాటిలో కొన్ని కాలిపోగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నట్లు కనిపించాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. అయితే తొలుత బయటకు వచ్చిన చిత్రాల్లో కనిపించిన నగదు ఆ తర్వాత అక్కడ కనిపించకపోవడం మరిన్ని అనుమానాలకు కారణమైంది. ఆ నోట్లతో తనకు ఎలాంటి సంబంధం లేదని వర్మ అప్పట్లో పేర్కొన్నారు. తనకు తెలియకుండా ఎవరో నగదును అక్కడ ఉంచి ఉండవచ్చని, తనపై కుట్ర జరిగి ఉండొచ్చని వాదించారు. ఈ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీయడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా విచారణ కోసం ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. వివిధ అంశాలను పరిశీలించిన ప్యానెల్.. వర్మ ఇచ్చిన వివరణలు విశ్వసనీయంగా లేవన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. బయటి వ్యక్తులు ఆయనకు తెలియకుండా నివాసంలోకి వచ్చి అంత పెద్ద మొత్తంలో నగదు ఉంచినట్లు నిరూపించే ఆధారాలు లభించలేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగదు ఎవరిది, ఎక్కడి నుంచి వచ్చింది, ఎంత మొత్తం ఉంది అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడంతో పాటు.. అగ్నిప్రమాదం తర్వాత కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించకుండా పోవడంపైనా వర్మ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయినట్లు ప్యానెల్ గుర్తించినట్లు సమాచారం. ఈ పరిణామాలతో యశ్వంత్ వర్మపై వచ్చిన అభియోగాలు రుజువైనట్లు ప్యానెల్ నిర్ధారించిన నేపథ్యంలో తదుపరి ప్రక్రియ ఎలా ఉండబోతోందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ముంబై ఘాట్‌కోపర్ ప్రాంతంలో విరిగిపడ్డ కొండచరియలు

**ఇద్దరు వ్యక్తులు మృతి.. శిథిలా కింద చిక్కున్న పలువురు**



**ముంబై, ఆగస్ట్ 12:** ముంబైలో భారీ వర్షాల వేళ ఘట్‌కోపర్-కుర్లా రహదారి సమీపంలోని అశోక్ నగర్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున చిరాగ్ నగర్‌లోని గౌషియా చాల్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాథోడ్ మెడికల్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో అక్కడి ఇళ్లు శిథిలాల కింద చిక్కుకున్నాయి. ముంబై పోలీసులు, బీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఆరుగురి మృతదేహాలను వెలికితీసి సమీప ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ముంబై ఫైర్ బ్రిగేడ్, పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్, బీఎంసీ వార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లలో చిక్కుకున్న 18 ఏళ్ల సోహెల్ అన్సారీ, 14 ఏళ్ల మొహమ్మద్ అన్సారీలను రక్షించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర్షాకాలానికి ముందే ఈ ప్రాంతంలోని పలు ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడినట్లు డీసీపీ గణెశిశ్ షిండే చెప్పారు. ముంబై మేయర్ రీతూ తవడే, అదనపు మున్సిపల్ కమిషనర్ అవినాశ్ దాకనే.. ఘటనా స్థలాన్ని సందర్శించారు.

# కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12:** కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే పక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు-2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మలయాళ స్థానిక ఉచ్ఛారణకు అనుగుణంగా అధికారిక పేరును మార్చాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం 2026 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం అవసరమైన పక్రియను పూర్తి చేస్తూ పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చారు. రెండు సభల్లోనూ బిల్లు ఆమోదం పొందడంతో, తదుపరి రాజ్యాంగపరమైన పక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రం అధికారిక పేరు 'కేరళం'గా మారనుంది. ఇందుకోసం రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో రాష్ట్రం పేరును సవరించాల్సి ఉంటుంది.

చురకలు



# "అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు తొలి రక్షణ – ఆలోచించి క్లిక్ చేయండి, ధృవీకరించి చెల్లించండి."

- సైబర్ క్రైమ్ జాగృత దివస్ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన
- పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్



**కులకచర్ల మండలం, ఆగస్టు,12:**
సైబర్ నేరాల పట్ల ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు "సైబర్ క్రైమ్ జాగృత దివస్" కార్యక్రమంలో భాగంగా బుధవారం కుల్కచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) బాలికల పాఠశాలలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాసులు, పరిగి సీఐ కె. కొండల్ రెడ్డి,కులకచర్ల ఎస్సై రమేష్ కుమార్, పోలీసులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నర్సింలు గౌడ్ మరియు సుమారు 140 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కూడా కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు మరియు యువత సోషల్ మీడియా, ఆన్‌లైన్ యాప్స్, డిజిటల్ చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ప్రధానంగా చర్చించిన సైబర్ మోసాల పద్ధతులు

**1. OTP మోసాలు:**
బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, కస్టమర్ కేర్ సిబ్బంది పేరుతో ఫోన్ చేసి OTP, PIN, CVV, UPI PIN వంటి రహస్య సమాచారాన్ని అడిగే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. OTPను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు.

**2. నకిలీ Loan Apps:**
తక్కువ సమయంలో రుణాలు ఇస్తామని చెప్పే అనధికారిక Loan Apps ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని, కాంటాక్ట్స్‌ను సేకరించి వేధింపులకు పాల్పడే అవకాశముందని వివరించారు.గుర్తుతెలియని యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని, అధికారిక వనరుల నుంచే యాప్స్‌ను వినియోగించాలని సూచించారు.

**3. Social Media Phishing మోసాలు:**
నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు, లింకులు, మెసేజీలు, బహుమతులు, ఉద్యోగ అవకాశాలు లేదా పరిచయస్తుల పేరుతో వచ్చే సందేశాల ద్వారా వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు మరియు బ్యాంకింగ్ వివరాలను దొంగిలించే అవకాశం ఉందని వివరించారు. తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు.

**4. Digital Arrest మోసాలు:**
పోలీస్, CBI, ED, కోర్టు లేదా ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో వీడియో కాల్ చేసి కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు బదిలీ చేయించే మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారతదేశంలో "Digital Arrest" పేరుతో పోలీసు అధికారులు ఎవరినీ ఆన్‌లైన్‌లో నిర్బంధించి డబ్బులు చెల్లించాలని ఆదేశించరని స్పష్టం చేశారు.

**5. Advertisement Fraud / Online Job Fraud:**
సోషల్ మీడియాలో కనిపించే నకిలీ ఉద్యోగ ప్రకటనలు, పెట్టుబడి అవకాశాలు,బహుమతులు, డిస్కౌంట్లు మరియు ఇతర ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించవద్దని సూచించారు. సంస్థ లేదా ప్రకటన నిజమైనదో కాదో ధృవీకరించిన తర్వాతే స్పందించాలని తెలిపారు.

**6. Online Betting Apps:**
ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ మరియు త్వరగా డబ్బు సంపాదించవచ్చని చెప్పే అనుమానాస్పద యాప్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఇటువంటి యాప్స్ ద్వారా ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం కూడా ఉందని వివరించారు.

**7. Banking & UPI Fraud:**
UPI PIN, ATM PIN, CVV, బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, కార్డు వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. డబ్బు స్వీకరించడానికి UPI PIN అవసరం లేదని, QR కోడ్ స్కాన్ చేయడం ద్వారా డబ్బు వస్తుందని చెప్పే మోసగాళ్లను నమ్మవద్దని వివరించారు.



### విద్యార్థులకు ముఖ్యమైన సైబర్ భద్రతా సూచనలు

బలమైన Passwordలు మరియు Two-Factor Authentication (2FA) ఉపయోగించాలి.తెలియని వ్యక్తుల Friend Requests, Links, Files మరియు Apps పట్ల జాగ్రత్తగా ఉండాలి.వ్యక్తిగత ఫోటోలు, పాస్‌వర్డ్‌లు, OTPలు మరియు బ్యాంకింగ్ వివరాలను సోషల్ మీడియాలో పంచుకోకూడదు.సోషల్ మీడియా Privacy Settings ను సరిగ్గా ఏర్పాటు చేసుకోవాలి.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి, సంబంధిత అధికారులను సంప్రదించాలి.సైబర్ నేరం జరిగినప్పుడు సాక్ష్యాలుగా ఉన్న స్క్రీన్ షార్ట్‌లు,ఫోన్ నంబర్లు, Transaction IDs, UPI IDs, URLs మరియు మేసేజ్ లను భద్రపరచుకోవాలి.ఈ సందర్భంగా డీఎస్పీ పరిగి ఎన్. శ్రీనివాసులు సీఐ పరిగి కె. కొండల్ రెడ్డి విద్యార్థులు సైబర్ ప్రపంచాన్ని సురక్షితంగా వినియోగిస్తూ, తమ కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు సుమారు 140 మంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపల్ కార్యాలయంలో జన్మదిన వేడుకలపై విచారణ జరపాలి

- కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు

**ఆలేరు, ఆగష్టు 12::** ఆలేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇటీవల నిర్వహించిన జన్మదిన వేడుకలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో వ్యక్తిగత లేదా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి ఉందా? ఉంటే ఎవరి నుంచి అనుమతి తీసుకున్నారు? అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా పరిపాలనకు సంబంధించిన కార్యకలాపాల కోసం ఉద్దేశించినవని, అలాంటి ప్రాంగణాల్లో వ్యక్తిగత లేదా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించినట్లయితే నిబంధనల ప్రకారం పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ భర్త భాస్కర్, వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుల పాత్రపైనా విచారణ జరపాలని ఆయన కోరారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఎవరి అనుమతి తీసుకున్నారు, మున్సిపల్ కార్యాలయ ప్రాంగణాన్ని ఏ నిబంధనల ప్రకారం వినియోగించారు అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు.విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై చట్టపరంగా, శాఖాపరంగా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల అమలు ఉండేలా అధికారులు



చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ డైరెక్టర్ ఆడేపు బాలస్వామి, మాజీ ఆర్టీఏ మెంబర్ పంతం కృష్ణ, మాజీ కౌన్సిలర్ బేతి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం.

**వలిగొండ ఆగస్టు 12 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి జగన్నాథరావు హాజరై, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు.ముఖ్యంగా చేయూత పింఛన్లకు సంబంధించిన అర్హత ప్రమాణాలు, ప్రభుత్వం నిర్దేశించిన వివిధ కేటగిరీలు (1.వితంతువులు, 2.ఒంటరి మహిళ, 3.వికలాంగులు, 4. టాడి టాపర్స్, 5.చేనేత, 6.ఫైలేరియా, 7.డయాలిసిస్), లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన అంశాలపై సమావేశంలో విపులంగా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ



మార్గదర్శకాల ప్రకారం పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పెన్షన్ కి సంబంధించిన దరఖాస్తులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా BPDP (బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్) మరియు GPDP (గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్) రూపకల్పన, అమలు మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికపై కూడా సంక్షిప్తంగా చర్చించారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, తహశీల్దార్ జీ దశరథ నాయక్, ఏపీఓ పరశురాములు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ కీర్తి, జూనియర్ అసిస్టెంట్ యం.డి సమిఉద్దీన్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అధికారులు సూచించారు.

# బిజెపి వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ.

**వలిగొండ ఆగస్టు 12 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు వలిగొండ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ తిరంగా ర్యాలీలో పాల్గొన్న జాతీయవాదులు, బిజెపి నాయకులు, వివిధ కుల సంఘాల పెద్దలు మాట్లాడుతూ ఈ తిరంగా ర్యాలీ దేశ ప్రజల యొక్క ఐక్యతను తెలియజేస్తుందని, అందుకు ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు నేటి బాలలే రేపటి పౌరులని వారందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని, దేశ ఔన్నత్యం కోసం ప్రతి ఒక్క భారతజాతి బిడ్డ పనిచేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, వలిగొండ సర్పంచ్ వెంకట పాపిరెడ్డి, బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు యాదగిరి, బిజెపి సీనియర్ నాయకులు రాచకొండ కిష్టయ్య, కనతాల అశోక్ రెడ్డి, బందారపు రాములు,రాస వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, జిల్లా నాయకులు బచ్చు శ్రీనివాస్, మై సొల్లా మచ్చగిరి మండల పదాధికారులు నాగరాజు, రంజిత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లో దే లింగస్వామి గౌడ్, మండల కార్యదర్శిలు వెంకటేశం, మహేష్, శ్రీనివాస్, మండల నాయకులు నరసింహ,



రామచంద్రం,చిన్న మచ్చ గిరి, పెద్ద కిట్టు, వెంకటేశం, జంగయ్య, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండ్లకుంటలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చెర్మైన్ నందారం ప్రశాంత్



**ఆగస్టు,12:**
కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గుండ్లకుంట గ్రామంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన పాఠశాల భవనం, డ్రైనేజీ పనులు, వాటర్ ట్యాప్ కనెక్షన్లు, విద్యుత్ పనులు, సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తో కలిసి పరిశీలించారు.పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయాలి

### కలెక్టర్ హైమావతి.



**రాయపోల్,ఆగస్టు 12:**
ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం రాయపోల్ మండలం కొత్తపల్లి శివారులోని సర్వే నంబర్ 265లో గల 6 ఎకరాలు, మండల కేంద్రంలోని సర్వే నంబర్ 729లోని 5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్, పోలీస్ తదితర భవనాల నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించి త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణమోహన్, సర్పంచ్ రాజు, సర్వేయర్ సిద్దార్థ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కొలనుపాక వాగు వంతెన పనుల పరిశీలన

### నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ

**ఆలేరు, ఆగస్టు 12::** కొలనుపాక వాగుపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. వంతెన నిర్మాణం పూర్తయితే దశాబ్దాలుగా రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొలనుపాక, పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో గాదె సోమిరెడ్డి, ఇమ్రాన్ ఖాన్, వార్డు సభ్యులు సిహెచ్. రమేష్, ఎం. సత్తయ్య, వి. పరశురాములు, వి. నరసింహులు, డాక్టర్ రమేష్, సాయి, దూడల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,12:**
తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు.ఈ కార్యక్రమంలో టేకులగడ్డ తండా ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఎంఆర్‌పీ సిబ్బంది గౌస్, ఐఆర్‌పీ వేణుగోపాల్, ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వారు అభినందించారు.



చురకలు



# ప్రజల భద్రతకే సీసీ కెమెరాలు

## సీఐ లతీఫ్



**రాయపోల్, ఆగస్టు 12:**
ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాయపోల్ సీఐ ఎస్కే. లతీఫ్ తెలిపారు. సురక్షా నేత్ర కార్యక్రమంలో భాగంగా రాయపోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ లతీఫ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంతోపాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యత, నేరాల నివారణలో వాటి పాత్రపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ కే. మానస, గ్రామ సర్పంచ్ మాసాన్ పల్లి రాజు,ఉప సర్పంచ్ హనుమంతు రాజు,సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు,హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీకి నూతన ట్యాంకర్ ను ఏర్పాటు.



**వలిగొండ ఆగస్టు 12 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామపంచాయతీ పాత వాటర్ ట్యాంక్ చాలా కాలంగా పాడైపోవడంతో గ్రామ ప్రజలు తాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ ఎర్పుల వెంకటేష్ ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యుల కట్ట జ్యోతిలక్ష్మి అంబటి గిరిబాబు ఏర్పుల పద్మ కాడిగళ్ల రామనరసింహ ఇంజమూరి శ్రీనివాస్ పులిపలుపుల అండాలు బత్తుల సువర్ణ సలబద్రి అభినయ్ మాదుగుల స్వర్ణలత గ్రామ పెద్దలు గాజుల మల్లేశం వెల్లంకి వెంకట్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది రాపోల్ బిక్షపతి వల్లమల్ల బిక్షపతి సహకారంతో గ్రామపంచాయతీ తరపున నూతన వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడటమే లక్ష్యంగా ఈ నూతన వాటర్ ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వేములకొండ గ్రామపంచాయతీ ముందుకు సాగుతోంది.

# ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి



**ఆలేరు, ఆగష్టు 12::** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలను వెంటనే చేపట్టాలని పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యమని విమర్శించారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పంగ రవి డిమాండ్ చేశారు.

# ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షునిగా కొండూరు రమేష్.



**వలిగొండ ఆగస్టు 12 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బుధవారం మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ కమిటీని ఎలక్షన్ కమిటీ సభ్యులు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని గణేశ్ , అప్పం అంబరీష , కొంపల్లి విజయ్ కుమార్, తాటి రమేష్ , బల్లెపు కృష్ణ ల ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ ఎన్నికలలో గౌరవ అధ్యక్షులుగా బొమ్మగాని వెంకటేష్, అధ్యక్షులుగా కొండూరు రమేష్, ఉపాధ్యక్షులుగా జువ్వగాని సుమన్, ప్రధాన కార్యదర్శిగా అవనగంటి శ్రీరామ్, కోశాధికారిగా బెల్లపు కృష్ణ సామి, సహాయ కార్యదర్శిగా మిర్యాల వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా చిట్టబోయిన తిరుమలేష్, కుటుంబ భరోసా ఇంచార్జ్ కొంపల్లి విజయకుమార్, కార్యవర్గ సభ్యులుగా వేలిమినేటి రమేష్, గుండు ఉదయ్ కుమార్,దంతూరు వెంకటేష్,బద్దం అయ్యప్ప లను మండల కమిటీ సభ్యులందరి ఓటు హక్కుతో నూతన కమిటీగా ఎన్నుకోవడం జరిగింది.

# రాఘవ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు

- **కంటి చికిత్సలు చేసుకున్న మహిళలు**

**ఆలేరు, ఆగష్టు12::** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య సేవల కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు పూర్తయిన అనంతరం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందిన పేషెంట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా తమ ఇళ్లకు క్షేమంగా చేరుకున్నారు. దీంతో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, పేషెంట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

**నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యం**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఖరీదైన వైద్య చికిత్సలు పొందలేని పేదలకు ఉచితంగా కంటి, ఇతర శస్త్రచికిత్సలు చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపడం ఎంతో సంతోషంగా ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. చికిత్స అనంతరం పేషెంట్లు ఆరోగ్యంగా తమ ఇళ్లకు చేరుకోవడం ఈ సేవా కార్యక్రమానికి లభించిన గొప్ప విజయమని పేర్కొన్నారు.చికిత్స పొందిన వారి ముఖాల్లో కనిపించిన ఆనందం, కుటుంబ సభ్యులు తెలిపిన కృతజ్ఞతలు తమ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పులిపలుపుల మహేష్ తెలిపారు.

**సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు**

ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యులు,



ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది, దాతలు, శ్రేయోభిలాషులు, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఉచిత వైద్య సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, వైద్య సహాయం అవసరమైన నిరుపేదలకు అండగా నిలుస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. సేవే లక్ష్యం, సమాజమే కుటుంబం అనే ఆశయంతో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

# కరణ్ కోట్ పిఎస్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.

- **8 మంది అరెస్ట్ – రూ.82,770 నగదు, పేక ముక్కలు స్వాధీనం.**
- **టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా**



**కరణ్ కోట్ మండలం, ఆగస్టు,12:**
వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం నమ్మదగిన సమాచారం మేరకు కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించింది.టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ,, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు "నమ్మదగిన సమాచారం మేరకు నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి నిర్వహించాం. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.82,770/- నగదు మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నాం. పట్టుబడిన వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించాం" అని తెలిపారు. జిల్లాలో పేకాట, జూదం మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని,చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా హెచ్చరించారు.పేకాటకు పాల్పడిన వారిపై కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.పేకాట స్థావరంపై సమర్థవంతంగా దాడి నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు బృంద సభ్యులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ అభినందించారు.

# ప్రతీ పల్లె చేతిలో ప్రపంచం ఉండాలి...

- **డిజిటల్ వెలుగు ప్రతి గడపకూ చేరాలి.. వరంగల్ ఎంపీ కడియం కావ్య**
- **చదువుకు, వైద్యానికి, ఉపాధికి... పల్లెలకు నెట్‌వర్క్ అవశ్యకత**
- **డిజిటల్ దూరం తొలగాలి.. వరంగల్ పల్లెలు ముందుకు సాగాలి**
- **వరంగల్ 5జీ విస్తరణపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ**

**వరంగల్, ఆగస్టు 12 : :** వరంగల్ జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు 4జీ, 5జీ మొబైల్ సేవలను మరింత విస్తరించడంతో పాటు నెట్‌వర్క్ బ్లాక్‌స్పాట్లను తొలగించి, డిజిటల్ మౌలిక వసతులను బలోపేతం చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై ఆమె లోక్‌సభలో ప్రశ్నలు సంధించారు.గత మూడేళ్లలో వరంగల్ జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ విస్తరణ పరిస్థితి, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరై ఏర్పాటు చేసిన మొబైల్ టవర్ల వివరాలు, నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఎంపీ వివరాలు కోరారు.ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం లోక్‌సభలో సమాధానమిచ్చారు. జూన్ 2026 నాటికి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం వరంగల్ జిల్లాలో 218 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో 217 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ, 216 గ్రామాలకు 4జీ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. 47 గ్రామాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒక్క గ్రామం కూడా నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదని పేర్కొన్నారు. 4జీ సేవలతో పాటు 5జీ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించాలని కేంద్రాన్ని కోరారు.నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ ప్రస్తుతం విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవలు, డిజిటల్ లావాదేవీలకు అత్యవసరంగా మారిందని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని వరంగల్ జిల్లాలో మిగిలిన నెట్‌వర్క్ లోటుపాట్లను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని కడియం కావ్య పేర్కొన్నారు.

# కరాటేతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట,ఆగస్టు,12:**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో కూడా రాణించాలని, కరాటే సాధనతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS అన్నారు.ఆగస్టు 9న హైదరాబాద్ చంపాపేట్‌లో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించి నారాయణపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS అభినందించి, ప్రశంస పత్రాలు, మెడల్స్ అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడలు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, డీఎస్పీ



మహేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ సలీం, జిల్లా ప్రెసిడెంట్ అశోక్, అనిల్ కుమార్, మండలాల ఇన్చార్జిలు తాయప్ప, తేయ్యాబ తది తరులు పాల్గొన్నారు.

# విగ్రహం జోలికొస్తే ప్రజాగ్రహం తప్పదు...

- **'పెద్ది' విగ్రహం తొలగించొద్దంటూ ఆర్డీవో, ఈస్ట్‌జోన్ డీసీపీకి బీఆర్ఎస్ నాయకుల వినతి**
- **ఉద్యమం నుంచి ప్రజాసేవ వరకు.. పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మృతిని కాపాడుతాం**
- **నిరుపేదల కోసం వైద్య సేవల విప్లవం..'పెద్ది' జ్ఞాపకాన్ని చెరిపేయలేరు**

**నర్సంపేట, ఆగస్టు 11 : :** ఓరుగల్లు ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించవద్దని కోరుతూ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నర్సంపేట ఆర్డీవో, వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీకి వినతిపత్రం అందజేశారు. ప్రజా సేవకు అంకితమైన నేత స్మారకంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పెద్ది



సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితంలో అందించిన సేవలకు గుర్తుగా ఆయన అభిమానులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి ప్రజా సేవకుడి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రాజకీయ కారణాలతో తొలగించాలని చూడటం సరికాదన్నారు.విగ్రహ ఆవిష్కరణకు ముందు గద్దెను కూల్చివేసినా, అదే ప్రదేశంలో తిరిగి గద్దె నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించామని వారు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ పార్టీ శ్రేణులు, అభిమానులు వెనక్కి తగ్గకుండా కార్యక్రమాన్ని పూర్తి చేశారని పేర్కొన్నారు.రాజకీయ కుట్రలో భాగంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తే నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి విగ్రహంపై ఎలాంటి చర్యలు తీసుకున్నా ప్రజలు క్షమించరని అన్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉద్యమకారుడిగా, ప్రజా నాయకుడిగా నర్సంపేట ప్రాంతానికి చేసిన సేవలను గుర్తించి ఆయన స్మారకాన్ని గౌరవించాలని కోరారు. విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం జరిగితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

చురకలు


# నూతన పెన్షన్ దరఖాస్తులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలి.

## సిపిఎం డిమాండ్.

**వలిగొండ ఆగస్టు 12:**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నూతన పెన్షన్ దరఖాస్తులో ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పెన్షన్లను ఆగస్టు 15 నుండి ప్రారంభిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన దానికి సంబంధించిన విధివిధానాల్లో అనేక ఆంక్షలను పెట్టి పెన్షన్లు ఇస్తాననడం సరి కాదని ఈ పెన్షన్ల మంజూరిలో వృద్ధులకు అవకాశం లేదని చెప్పడం మరొకవైపు తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి దాని ప్రాతిపదికన




పెన్షన్లు మంజూరు చేయకుండా ఆదాయ పత్రం తప్పనిసరిగా ఉండాలని ప్రైవేటు ఉద్యోగాలు చేసే వారి కుటుంబ సభ్యులకు మరియు నాలుగు చక్రాల వాహనాలు ఉన్న వారికి అవకాశం లేదని చెప్పడం దుర్మార్గమన్నారు. కొంతమంది తమ జీవనోపాధి కోసం నాలుగు చక్ర వాహనాలను కొనుగోలు చేసి దానిపై ఆధారపడి బ్రతుకుతున్నారని అలాంటి వారి కుటుంబ సభ్యులకు ఇది అన్యాయం చేసే విధంగా ఉందని వెంటనే ఇలాంటి అనేక రకాల అంశాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇలా కొన్ని అంశాలను పెట్టి పెన్షన్ల మంజూరులో కోతలు పెట్టడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుందని వెంటనే ఇలాంటి ఆలోచనలను విరమించుకోవాలని తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ మరియు 57 సంవత్సరాలు నిండిన వృద్ధులందరికీ వెంటనే నూతన పెన్షన్లను మంజూరు చేయాలని అదేవి ధంగా తంలో అనేకసార్లు దరఖాస్తు పెట్టు కున్న వారందరి యొక్క సమాచారాన్ని ఆన్లైన్ లో ఉన్నప్పటికీ తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలనడం గతంలో ఆన్లైన్ లో దరఖాస్తు ఉన్న వాటిని ప్రభుత్వం బయట పెట్టకపోవడం పెన్షన్ దారులను అయోమయానికి గురిచేస్తుందని వెంటనే ప్రభుత్వం ఇలాంటి అనుమానాలకు తావు లేకుండా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యసన ముక్తి ప్రతిజ్ఞ

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,12:**
కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కళాశాల ఎన్. ఎస్. ఎస్ విభాగాలు మరియు బ్రహ్మకుమారి స్థానిక సేవాకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మరియు సిబ్బందిచే వ్యసన ముక్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మ కుమారి పరిమళ మాట్లాడుతూ,,యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చైతన్యం వైపు అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి ధర్మానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. క్రీడలకు ప్రాధాన్యత పెరగాలన్నారు. చెడు వ్యక్తులను అనుకరిచడం కాదు, మంచి లక్షణాలు గల వారిని అనుసరించడం ముఖ్యమన్నారు. స్వయం పరివర్తనతోనే విశ్వ పరివర్తన సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ సంస్కృతి పాశ్చాత్య పోకడ అని దానిని ప్రతి ఒక్కరూ దరిచేరనీయకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాల్ని నెరవేర్చాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారి తరఫున ప్రిన్సిపాల్ కు ప్రసంసా పత్రాన్ని అందజేశారు మరియు ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి. రాంబాబు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం అధికార్లు డా. ఆర్. శ్రీనివాస్, డా. ఈ. సోమ్లా మరియు డా. కె. రమేష్ బాబు, కె. అన్నపూర్ణ, డా. వి. శ్రీధర్ కుమార్ ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# సమీకృత వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం

**ఆలేరు, ఆగస్టు 12::** పంటల సాగుతో పాటు పశుపోషణ, కోళ్ల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు వంటి అనుబంధ కార్యకలాపాలను చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వర్షాధార ప్రాంతాల్లో సమీకృత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, సాగునీటి కొరతను అధిగమించేందుకు పంటల వైవిధ్యీకరణ ఎంతో ఉపయోగపడుతుందని ఆలేరు ఏడీఏ నిర్మల తెలిపారు.



భూమి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలకు అనుగుణంగా కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. తెలంగాణ భువనగిరి రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా పంటలతో పాటు పశుపోషణ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవచ్చన్నారు. పంటల అవశేషాలను పశుగ్రాసంగా, పశువుల పేడ, మూత్రాన్ని జీవ ఎరువుల తయారీలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల గట్లపై పండ్ల మొక్కలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు, అనువైన చెట్లను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయంతో పాటు భూమి సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.కార్యక్రమంలో పి ఏ సి ఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, సర్పంచ్ యాదిరెడ్డి, ఉప సర్పంచ్‌లు యాదగిరి, దశరథ, ఏఈవోలు అంజయ్య, శివకుమార్, భార్గవి, తిరుమలరావు, ఆత్మ బీటీఎం వేణు, రైతులు పాల్గొన్నారు.

# యువతే కాంగ్రెస్ బలం.. కష్టపడే వారికి ఉజ్వల భవిష్యత్తు...

- వేం నరేందర్ రెడ్డి
- యువ శక్తికి కాంగ్రెస్ వేదిక.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి
- యువ నాయకుడు రహమతుల్లాకు వేం నరేందర్ రెడ్డి దిశానిర్దేశం

**హన్మకొండ, ఆగస్టు 12 : :** రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, యువత రాజకీయాల్లో మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అంశాలపై వేం నరేందర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువ నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు.కష్టపడి పనిచేసే యువతకు కాంగ్రెస్ పార్టీలో మంచి అవకాశాలు, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే నాయకత్వమే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ మంచి పనులు చేయడం ద్వారా ప్రజల్లో మంచి పేరు, విశ్వాసం సంపాదించుకోవాలని రహమతుల్లా కు సూచించారు.ఈ సందర్భంగా రహమతుల్లా మహమ్మద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి విలువైన సూచనలు, ప్రోత్సాహం అందించిన వేం నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యువతను ప్రోత్సహిస్తూ, ప్రజాసేవకు మార్గనిర్దేశం చేసిన వేం నరేందర్ రెడ్డి సూచనలు తనకు



మరింత స్ఫూర్తినిచ్చాయని రహమతుల్లా మహమ్మద్ పేర్కొన్నారు.

# పతంగి డిజైన్ పోటీలో బాలికలు, యువతులు పాల్గొనాలి

**ఆలేరు, ఆగస్టు 12::** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా తుఝే సలాం రాష్ట్రీయ పతంగ్ డిజైన్ పోటీని బుధవారం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలా హైస్కూల్‌లో నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ బాలికలు, యువతులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పతంగి దారం మీ చేతిలోనే ఉంది, ఆకాశమే కాన్వాస్ మీ ఊహలకు రెక్కలు ఇవ్వండి అంటూ 12 నుంచి 25



సంవత్సరాల వయస్సు గల బాలికలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీలో పాల్గొనే వారు తమ సృజనాత్మకతతో పతంగులను స్వయంగా డిజైన్ చేసి, సంబంధిత వివరాలను అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీకి పంపించాలని సూచించారు. పోటీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు అందజేస్తారని తెలిపారు.పతంగి డిజైన్ చేసిన బాలికలు, యువతులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నీలం పద్మ సూచించారు. యువతులు తమ ప్రతిభను చాటుకునేందుకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏకశిలా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఇందిరా, ఉపాధ్యాయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరానికి చౌటుప్పల్ డిఎస్పికి ఆహ్వాన పత్రిక అందజేత.

**వలిగొండ ఆగస్టు 12:**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు15న నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డిని ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వెలువర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని యాదాద్రి తలసేమియా బ్లడ్ సెంటర్ మరియు యశోద హాస్పిటల్ డాక్టర్లచే హెల్త్ చెకప్ సదన్ ఐస్ కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లం నరేష్, బూడిద రాజు, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్, కోశాధికారి మల్లం సాయి, కార్యదర్శి మల్లం మహేష్, కలుకూరి విక్రమ్, కలుకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం



**ఆలేరు, ఆగస్టు 12::** స్వయం సహాయక సంఘాల మహిళలకు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని శారాజిపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కుటుంబ సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా ఉచితంగా అవసరమైన ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి రావడంతో మహిళలు తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని, అవసరమైన వైద్యం పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రతి మహిళ ఈ ఉచిత ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ వైద్య సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే తెలిపారు.

# కొలనుపాక సోమేశ్వరాలయంలో అమావాస్య అల్పాహార వితరణ, గోసేవ



**ఆలేరు,ఆగస్టు 12::** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొలనుపాక శ్రీ సోమేశ్వరాలయంలో ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం అల్పాహార వితరణ, గోసేవ కార్యక్రమాలు నిర్వహించారు.ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేయడంతో పాటు గోసేవ చేపట్టారు. సేవా కార్యక్రమాలకు చాలా ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగబండి నరహరి, ఆయన కుమారుడు నాగబండి కుమార్ దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దాతలకు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీ సోమేశ్వరస్వామిని ప్రార్థించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు, అవసరమైన వారికి సహాయం అందించడమే తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సారాబు సంతోష్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొద్దుటూరు రమేష్, యువజన విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ పడకంటి సందీప్, యూత్ విభాగం సెక్రటరీ బచ్చు మణికంఠ, కొలనుపాక గ్రామస్తులు నంగునూరు కృష్ణమూర్తి, నంగునూరు ఆంజనేయులు, సంతోష్ కుమార్, వంగపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో ఐదు నెలల శిశువు మృతి



**ఆలేరు, ఆగస్టు 12 ::** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సాయి శ్రీ చిన్నపిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదు నెలల శిశువు మృతి చెందిన సంఘటన జరిగింది. ఆలేరు ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు మండలం సింగారం గ్రామానికి చెందిన మందుల అనిల్, పద్మ దంపతుల కుమార్తె తన్వికు జ్వరం, జలుబు ఉండటంతో మంగళవారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం శిశువుకు జ్వరం తీవ్రం కావడంతో తల్లిదండ్రులు మళ్లీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శిశువుకు సరైన వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారి ఆందోళనకు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

### పోలీసుల విచారణ:

శిశువు మృతిపై ఆలేరు పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఆలేరు ఎస్సై వినయ్ తెలిపారు.

## ఆలేరులో 40 గ్రాముల గంజాయి స్వాధీనం



**ఆలేరు, ఆగస్టు 12::** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగంపై ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి వద్ద నుంచి 40 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ భువనగిరి సీఐ రాధాకృష్ణ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు బాను, మదర్ పాషా, జంగీర్, నిహారిక ఈ తనిఖీలు చేపట్టారు. ఆలేరు పట్టణానికి చెందిన మార్గం జగన్, తండ్రి శ్రీనివాస్ వద్ద 40 గ్రాముల ఎండు గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించిన అధికారులు, కేసుకు సంబంధించిన పత్రాలను తదుపరి చర్యల నిమిత్తం ఆలేరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. ఘటనపై పోలీసులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

## నవీన ఆదర్శ హైస్కూల్ లో విద్యార్థులకు నషముక్తి ప్రతిజ్ఞ మరియు అవగాహన సదస్సు



**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,12:**
బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో 10కోట్ల మందిచే కేంద్ర ప్రభుత్వంచే నషముక్తి ప్రతిజ్ఞ మరియు అవగాహన సదస్సు భాగంగా బుధవారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ హైస్కూల్ లో విద్యార్థులు ఉపాధ్యాయుల చేత నషముక్తి, వ్యాసన ముక్తి ప్రతిజ్ఞ మరియు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు కొడంగల్ బ్రహ్మకుమారిస్ బికే పరిమళ గారిచే ఘనంగా చేయించారు. ఇట్టి కార్యక్రమంలో ఫౌండర్ లక్ష్మీ వెంకటయ్య, ప్రిన్సిపాల్ డివీ.నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ బృందం పాల్గొని మా పాఠశాలలో మరియు మా పరిసరాలలో వ్యసన రహితంగా ఉండేందుకు నా వంతు సహకారం అందిస్తానని దేశాన్ని ఆదర్శమైన విద్యార్థిగా వ్యాసనాముక్తి భారతదేశ నిర్మూలములో బాధ్యతగా నా వంతు కృషి చేస్తానని దృడ నిశ్చయంతో ప్రతిజ్ఞ చేస్తున్నామని ప్రతిజ్ఞ చేయించారు వ్యాసన ముక్తి ప్రతిజ్ఞ మరియు చెడు వాసనాలకు అందరూ దూరంగా ఉండాలని విద్యార్థులు ఉపాధ్యాయుచే ప్రతిజ్ఞ చేయించి ప్రశంసా పత్రం అందజేశారు.

## ఫిరంగి నాలాను రక్షించండి.. అక్రమాలను తొలగించడి

**తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే**



**రంగారెడ్డి,ఆగస్టు 12 :**రంగా రెడ్డి జిల్లాలోని ఫిరంగి నాలాపై ఉన్న అక్రమాలను తొలగించి,సకల జీవులకు ప్రాణాధారమైన సాగునీరు,తాగునీరు అందించే ఫిరంగి నాలాను రక్షించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు విజ్ఞప్తి చేశారు.బుధవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ ను ప్రత్యేకంగా కలుసుకొని రంగారెడ్డి జిల్లాలో ప్రవహిస్తున్న ఫిరంగి కాలువ గురించి పూర్తిగా వివరించారు.జలమూ, నీరూ పంచభూతాలలో పరమ పవిత్రమైనవని,ప్రాణాధారమైనవని పేర్కొంటూ ఫిరంగి నాలా పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఫిరంగి నాలా ద్వారా భూమి,నది,పర్వత సాగరాలతో పాటు జంతువులు,లోకాలు,గిరులు,నదులు, దిక్కులు అన్నీ విస్తరించిన విశ్వ ప్రాణం కొనసాగుతుందని తెలిపారు.ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఫిరంగి నాలాపై ఉన్న అక్రమాలను తొలగించి,దాని సహజ ప్రవాహాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఫిరంగి నాలా పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ రంగనాథ్ ను కోరారు.

## కీర్తినగర్ లో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం...

- **ఆధార్ కార్డుతో మృతురాలి గుర్తింపు.. అనుమానాస్పద మరణం కాదన్న కుమారుడు**

**గీసుగొండ, ఆగస్టు 12 : :** వరంగల్ కీర్తినగర్‌లోని కట్టమల్లన్న దేవాలయం సమీపంలోని ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చిన్న గదిలో ఓ మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గుర్తించి, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీసుల తనిఖీల్లో "బూర రామ, చిన్న గురజాల, నర్సంపేట" అనే వివరాలతో కూడిన ఆధార్ కార్డు లభించింది. దాని ఆధారంగా మృతురాలి కుటుంబ సభ్యులను గుర్తించి సమాచారం అందించారు.బంధువుల వివరాల ప్రకారం రామ కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ నర్సంపేట, చెన్నారావుపేటతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల పరిసరాల్లో సంచరిస్తూ ఉండేది. గతంలో పలుమార్లు ఆమెను కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చినా, తిరిగి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయేదని తెలిపారు.కాగా, మృతురాలి కుమారుడు సతీష్ తన తల్లి మృతిపై ఎలాంటి అనుమానం లేదని పేర్కొంటూ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో అతని ఫిర్యాదు ఆధారంగా U/s 194 BNSS కింద గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపారు.మృతదేహానికి పోస్టుమార్టం సహా అవసరమైన వైద్య, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించే చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## అక్రమంగా నిర్వహిస్తున్న క్రషర్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలి.

- **రైతుల ఆందోళన.**
- **రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా క్రషర్‌కు అనుమతి**

**వలిగొండ ఆగస్టు 12 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామంలో పంట పొలాల మధ్య క్రషర్ మిషన్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా క్రషర్‌కు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.గ్రామంలో ఇప్పటికే మూడుసార్లు సభలు నిర్వహించి క్రషర్ మిషన్ వద్దని గ్రామ ప్రజలు, రైతులు స్పష్టంగా అభ్యంతరం తెలిపినప్పటికీ, తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడం ఏమిటని రైతులు నిలదీశారు.క్రషర్ మిషన్ కారణంగా వెలువడే దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూములు నాశనమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని, పంట పొలాలే తమ జీవనాధారమని తెలిపారు.మా పంట పొలాలను నాశనం చేసే క్రషర్ మిషన్ మాకు వద్దు. రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా అనుమతి ఇవ్వడం సరికాదు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్రషర్ అనుమతులను పరిశీలించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని వారు కోరారు.ఈ ఆందోళన కార్యక్రమంలో ఎలిమినేటి జంగారెడ్డి, శ్రీశైలం రెడ్డి, సత్తిరెడ్డి సునీత, మల్లారెడ్డి కలమ్మ, వెంకట్ రెడ్డి విమల, మోహన్ రెడ్డి పద్మ, శ్రీనివాస్ రెడ్డి, అంజమ్మ, బుచ్చిరెడ్డి లక్షి , దుబ్బ రమేష్, బాల నర్సమ్మ, పల్లపు అంజమ్మ, శీను కనకమ్మ, సత్తిరెడ్డి వెంకట్రెడ్డి, జంగారెడ్డి, మిటకానికి కిరణ్ రెడ్డి, దుర్గమ్మ, సరిత, శారద, వట్టిపల్లి స్వామి, పైల మోహన్ రెడ్డి, పైల మల్లమ్మ, పల్లపురి రాములు, యాదయ్య, జలంధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి అండమ్మ, లక్ష్మమ్మ, వనగంటి నరేష్, బండారి లక్ష్మమ్మ, ఏనుగు లింగారెడ్డి, మద్ది పుట్టారెడ్డి, భారతమ్మ, శ్యామల రమేష్, శైలజ, సుజాత, పల్లపు నరసింహ, పద్మ, మంగమ్మ తదితర రైతులు పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **డీఎస్పీ నల్లపు లింగయ్య**
- **పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి**
- **నాణ్యమైన దర్యాప్తుతో శిక్షల శాతం పెంచాలి**
- **ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.**





**నారాయణపేట, ఆగస్టు,12:**
నారాయణపేట: మక్తల్, కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసులకు డీఎస్పీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశాన్ని డీఎస్పీ నల్లపు లింగయ్య నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన డీఎస్పీ, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిపై సీఐలు, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు సమయంలో అనుసరించాల్సిన విధానాలు, సేకరించాల్సిన ఆధారాలు, కేసు దర్యాప్తులో పాటించాల్సిన ప్రామాణిక విధానాల (SOP) గురించి అధికారులకు వివరంగా మార్గనిర్దేశనం చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు ఉండాలని, ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (Plan of Action) ప్రకారం కేసులను ఛేదించాలని సూచించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. కేసు నమోదు నుండి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి దశను కూలంకషంగా పరిశీలించి పారదర్శకతతో దర్యాప్తు జరపాలని ఆదేశించారు.అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదయ్యే కేసులు, ఇతర గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి 60 రోజుల్లోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.ప్రతి పోలీసు అధికారి స్టేషన్ నిర్వహణతో పాటు పూర్తి స్థాయి దర్యాప్తు నైపుణ్యాలు కలిగి ఉండాలని, కేసుల వివరాలను ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మన గ్రామం, మన పోలీసు కార్యక్రమంలో పోలీసు వాల్ ఏర్పాటు చేయని గ్రామాల త్యారగ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాబోయే గణేష్ పండుగ సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో సీఐలు రామ్ లాల్, సైదులు ఎస్సై లు అశోక్ బాబు, రాజు,ఎస్.ఎం. నవీద్, రమేష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పాతికేళ్ల ప్రస్థానానికి పండుగ వేళ...

- **సిల్వర్ జూబ్లీకి మంత్రి కొండా సురేఖ దంపతులకు ఆహ్వానం**
- **అనుబంధాల వెండి వేడుక.. మున్నూరు కాపు పరపతి సంఘం సిల్వర్ జూబ్లీ**
- **పాతికేళ్ల జ్ఞాపకాలు.. భవిష్యత్ లక్ష్యాలతో సిల్వర్ జూబ్లీ సంబరం**

**వరంగల్/కరీమాబాద్ , ఆగస్టు 11 : :** మున్నూరు కాపు పరపతి సంఘం 25 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ–మురళీధర్‌రావు దంపతులను సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం సంఘం ప్రతినిధులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.సంఘం ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సభ్యులు, కుటుంబాలతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు విహారయాత్రను కూడా నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.కరీమాబాద్ (వరంగల్)లో నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ దంపతులు పాల్గొని సంఘం సభ్యులను ఉద్దేశించి మాట్లాడాలని ప్రతినిధులు కోరారు. అనంతరం తమిళనాడు విహారయాత్రకు బయలుదేరనున్న బస్సులను వారి చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా సభ్యుల పరస్పర సహకారం, ఐక్యత, నమ్మకంతో మున్నూరు కాపు పరపతి సంఘం నిరంతరం అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోందన్నారు. సభ్యుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి సంఘం తన వంతు కృషి చేస్తూ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.సిల్వర్ జూబ్లీ వేడుకలు సంఘం 25 ఏళ్ల ప్రస్థానాన్ని స్మరించుకునే ప్రత్యేక సందర్భమే కాకుండా, భవిష్యత్‌లో మరింత సమర్థవంతంగా సేవలను విస్తరించేందుకు కొత్త లక్ష్యాలను నిర్దేశించుకునే వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.మంత్రి కొండా సురేఖ దంపతులను కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల సంఘం ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. వారి రాకతో వేడుకలకు మరింత ప్రత్యేకత, ఉత్సాహం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు పరపతి సంఘం ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం పర్యటనకు పరకాల ముస్తాబు.. పకడ్బందీ ఏర్పాట్లపై 'రేవూరి' దిశానిర్దేశం

- **పరకాల పర్యటనకు పకడ్బందీ ప్లాన్.. రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే రేవూరి సమీక్ష**
- **సీఎం సభకు భారీ ఏర్పాట్లు.. ప్రజల సౌకర్యానికే తొలి ప్రాధాన్యం**



**హనుమకొండ, ఆగస్టు 12 : :** ఈ నెల 16న పరకాల పట్టణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు, చివరి నిమిషం ఇబ్బందులకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించి వివిధ శాఖలు చేపడుతున్న ఏర్పాట్లు, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పాల్గొనే సభా వేదిక, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, ప్రజలు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, భద్రతా చర్యలపై సమగ్రంగా చర్చించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సభా ప్రాంగణంలో వైద్య బృందాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.సీఎం పర్యటన సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య, విద్యుత్, రవాణా, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. వీఐపీ రాకపోకలు, ప్రజల ప్రవేశం, అత్యవసర మార్గాలకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు.ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని, సమన్వయంతో పనిచేస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, పర్యటనకు ముందు క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని మరోసారి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి పర్యటన పరకాల ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

# సామాజిక బాధ్యత కలిగిన యువతగా ఎదగాలి...

- దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది -
- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్.....



**నారాయణపేట, ఆగస్టు,12:** నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు, నారాయణపేటలోని ద్వారకా హై స్కూల్ లో బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం మరియు విలువైన మానవ ప్రాణాలను కాపాడేందుకు అవయవాలను దానం చేయడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.న్యాయమూర్తి మాట్లాడుతూ,,ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటుంది.సమాజంలో మార్పు తెచ్చే శక్తి కేవలం యువతకే సాధ్యం అని,క్రమశిక్షణ, చదువు, ప్రభుత్వ చట్టాల మీద అవగాహన ఉండాలి అని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. రాజ్యాంగ లోని ప్రధాన హక్కులు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (DLSA ) ఆధ్వర్యంలో అమలవుతున్న ఉచిత న్యాయ సహాయ పథకాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి యువతకు నేరుగా న్యాయపరమైన అవగాహన కల్పించడానికి న్యాయ సేవా సంస్థలను స్థానిక స్వపరిపాలన సంస్థలు, పాఠశాలలు మరియు కమ్యూనిటీ కేంద్రాలతో,ప్రాథమిక హక్కులు, విధులు మరియు కీలకమైన బాలల రక్షణ చట్రాల గురించి యువతకు అవగాహన కల్పించడంపై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధానంగా దృష్టి సారిస్తుంది అన్నారు. యువతకు వారి సొంత స్థానిక సమాజాలలో చట్టపరమైన అవగాహన రాయబారులుగా శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని శక్తివంతం చేస్తుంది, తద్వారా పారదర్శకత మరియు చురుకైన వివాద పరిష్కార సంస్కృతిని ప్రోత్సహిస్తుంది తెలిపారు. పోక్సో చట్టం, 2012 (లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ) పై లక్షిత సమావేశాలను నిర్వహిస్తుంది , భద్రతా భావనలు, చట్టపరమైన రక్షణలు మరియు ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన ఇచ్చారు. పోక్సో చట్టం మన యువతకు ఒక రక్షణ కవచం. కానీ చట్టాలు మాత్రమే నేరాలను ఆపలేవు. వేధింపులకు వ్యతిరేకంగా గళం విప్పేలా మన పిల్లలకు మనం బోధించాలి. ప్రతి విద్యార్థి సురక్షితంగా, తమ మాట వింటున్నారని, తమకు రక్షణ ఉందని భావించే సమాజాన్ని మనం నిర్మించాలి ఉపాధ్యాయులకు ఆదేశించారు.తదుపరి జిల్లా ఆరోగ్య అధికారి (DMHO) డాక్టర్ కె. జయచంద్ర మోహన్‌అ మాట్లాడుతూ,, అవయవ మరియు కణజాల దాతల యొక్క తీవ్రమైన అవసరం గురించి అవగాహన కల్పించారు. అవయవదానం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. "చదువుతో పాటు మానవత్వం కూడా చాలా ముఖ్యం. ఒక వ్యక్తి మరణానంతరం అవయవదానం చేస్తే 8 మందికి కొత్త జీవితాన్ని ఇచ్చిన వారవుతారు. చనిపోయిన తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడే గొప్ప అవకాశం ఇది" అని విద్యార్థులకు వివరించారు. అవయవదానంపై ఉన్న మూఢనమ్మకాలను వదిలి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.ఇతరులు జీవించడానికి సహాయం చేస్తూ మీరు జీవించండి. "రెండవ జీవితాన్ని ఇవ్వడం మీ చేతుల్లోనే ఉంది." ఆదేవిందగా మీ తల్లితండులకు తెలియజేయాలకి అని ఆజ్ఞాపించారు.విద్యార్థులకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి విద్యార్థితో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు: 1098 – చైల్డ్ హెల్ప్‌లైన్ (24x7), 181 – మహిళా హెల్ప్‌లైన్, 15100 – NALSA ఉచిత న్యాయ సహాయం, 112 – అత్యవసర సేవ టోల్–ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు ఆదేవిందగా మీ తల్లితండులకు తెలియజేయాలకి అని ఆజ్ఞాపించారు..ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి (DMHO) డాక్టర్ కె. జయచంద్ర మోహన్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మి పతి గౌడ్, అడ్వొకేట్ నందునమాజీ, అలేఖ్య, ప్రిన్సిపల్, రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాధితుల పక్షాన 'రేవూరి'.. పరకాల భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- 50 ఎకరాల భూమి.. కబ్జా ఆరోపణలు.. సమగ్ర విచారణకు రేవూరి ఆదేశం
- భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టి
- బాధితులకు న్యాయం చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వినతిపత్రం



హనుమకొండ, ఆగస్టు 12 : : పరకాల పట్టణంలో భూముల అక్రమ ఆక్రమణకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.పరకాల పట్టణంలోని సర్వే నంబర్లు 682, 683, 698, 195, 637, 640, 648, 750, 751, 752, 746, 749, 779లో సుమారు 50 ఎకరాల భూమి అక్రమ ఆక్రమణకు గురైనట్లు పలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సమగ్ర స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గు తేల్చాలని కోరారు.నకిలీ లేదా కల్పిత పత్రాలను సృష్టించి భూములను ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నందున సంబంధిత రెవెన్యూ రికార్డులు, భూ పత్రాలు, హక్కుల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రికార్డుల పరిశీలనతో పాటు క్షేత్రస్థాయిలో భూముల పరిస్థితిని కూడా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని పేర్కొన్నారు.భూముల వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అక్రమ ఆక్రమణల కారణంగా నష్టపోయిన బాధితుల హక్కులను పరిరక్షించి వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భూములు, ప్రజల భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ జరిపించాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# రైతు కన్నీటికి భరోసా.. పల్లె బతుకులకు 'సహకార'మే అండ

- ఎన్‌సీడీసీ సవరణ బిల్లుకు బీఆరెస్ సంపూర్ణ మద్దతు... రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- రైతు, నేతన్న, మత్స్యకారుడు, గ్రామీణ యువత బతుకుల్లో మార్పే లక్ష్యం
- శ్రమించే చేతులకు చేయూత.. పల్లె బతుకులకు భరోసా
- గ్రామీణ యువతకు ఉపాధి.. రైతులకు మార్కెట్ భరోసా కల్పించాలి

**వరంగల్, ఆగస్టు 12 : :** సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చేలా ఎన్‌సీడీసీ సవరణ బిల్లు–2026 దోహదపడాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. సహకార ఉద్యమం కేవలం ఒక సంస్థాగత వ్యవస్థ కాదని, ఆర్థిక సమ్మిళితం, సమానమైన సంపద సృష్టి, గ్రామీణ వ్యాపారాభివృద్ధి, ఉపాధి కల్పనకు అది కీలక సాధనమని అన్నారు.ఎన్‌సీడీసీ సవరణ బిల్లు–2026పై రాజ్యసభలో




బుధవారం జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. బీఆర్ఎస్ తరఫున, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశా నుసారం బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తు న్నట్లు ప్రకటించారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణలో సహకార రంగానికి విశేష ప్రాధాన్యత లభించిందని రవిచంద్ర పేర్కొన్నారు. రైతులు, పాడి రైతులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా లకు సహకార వ్యవస్థ ద్వారా అనేక ప్రయో జనాలు అందుతున్నాయని తెలిపారు. సహకార సంఘాల ద్వారా లభించే రుణాలు, సామూహిక మార్కెటింగ్, ఉత్పత్తులకు విలువ జోడింపు, ప్రమా దాలను సమష్టిగా ఎదుర్కొనే అవకాశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ముఖ్యంగా రైతులు, గ్రామీణ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడంలో సహకార వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.తెలంగాణలోని 33 జిల్లాల్లో సుమారు 900 సహకార సంఘాల ద్వారా రైతులు, గ్రామీణ ప్రజలకు రుణాలతో పాటు ఇతర సహాయ సహకారాలు అందుతున్న విషయాన్ని ఎంపీ సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయంతో పాటు పాడి, మత్స్య, చేనేత వంటి అనుబంధ రంగాలకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.చేనేత కార్మికులకు భూమి, ఆధునిక పరికరాలు, ఉత్పత్తి కేంద్రాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్డర్లు కల్పించడం ద్వారా వారి జీవనోపాధికి మరింత భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారులకు అవసరమైన వనరులు, పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచ వచ్చని పేర్కొన్నారు.గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు స్వయం ఉపాధి కోసం తక్కువ వడ్డీతో ఆర్థిక సహాయం, రుణ సదుపాయాలు అందించాలని రవిచంద్ర కోరారు. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే వ్యవసాయంతో పాటు పాడి, మత్స్య, చేనేత, ఇతర అనుబంధ రంగాలను సమాంతరంగా బలోపేతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ, పాడి ఉత్ప త్తులకు ఉన్న డిమాండ్, మార్కెట్ ధరలు, విక్రయ అవకాశాలపై రైతులకు సమగ్ర సమాచారాన్ని అందించే వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు ప్రాథమిక సహకార సంఘాలను మరింత సమర్థ వంతంగా వినియోగించుకోవడం ద్వారా రైతులకు రుణాలు, మార్కెట్ సదుపా యాలు, సాంకేతిక సహాయం అందించ వచ్చని తెలిపారు.రైతులు, కార్మికులు, గ్రామీణ ప్రజలు, సహకార సంస్థలు సమష్టిగా పనిచేసినప్పుడే దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేత మవుతుందని రవిచంద్ర అన్నారు. సహ కార రంగాన్ని కేవలం రుణాల పంపిణీ వ్యవస్థగా కాకుండా ఉత్పత్తి, ఉపాధి, మార్కెటింగ్, విలువ జోడింపు, స్వయం సమృద్ధికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సహకార రంగానికి మరింత ఆర్థిక బలం, సంస్థాగత సామర్థ్యం, ఆధునిక సాంకేతికత, మార్కెట్ అవకాశాలు కల్పించేలా ఎన్‌సీడీసీ సవరణ బిల్లు–2026 అమలు కావాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

# సర్వమత సామరస్యానికి ప్రతీక కాజీపేట దర్గా...

- ఉర్సు వేడుకల్లో ఘనంగా చాదర్ సమర్పించిన దాస్యం వినయ్ భాస్కర్

**హనుమకొండ, ఆగస్టు 12 : :** కాజీపేట దర్గా హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని రహ్మతుల్లాహి అలైహి ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం దర్గాకు ఘనంగా చాదర్ సమర్పించారు.ముందుగా పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో చాదర్‌ను కాజీపేట దర్గాకు తీసుకెళ్లారు. దర్గా వద్ద దాస్యం వినయ్ భాస్కర్ చాదర్ సమర్పించి ప్రత్యేక దుఆ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేట దర్గా సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల మధ్య సోదరభావం మరింతగా పెంపొందాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు.ప్రతి ఏటా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని చాదర్ సమర్పించడం సంప్రదాయంగా కొనసాగుతోందని వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం



ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో నిజామాబాద్ సీపీ సమగ్ర సమీక్ష

- డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు
- అక్రమార్కులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు, బ్లాక్ స్పాట్ల గుర్తింపు





**కోటగిరి, ఆగష్టు 12 :** బోధన్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. హెచ్చరించారు. కోటగిరి పోలీస్ స్టేషన్‌లో బోధన్ డివిజన్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమగ్ర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అక్రమ రవాణాదారులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన సైబర్ బాధితులకు తక్షణమే సహాయం అందించాలని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు రాత్రి పహారా, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలతో విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద పర్యవేక్షణ పెంచాలని సూచించారు. పేకాట, గుట్కా, ఇసుక అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లపై రోజూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం కల్పించాలని, అత్యవసర సహాయం కోసం 'డయల్ 112'పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రాబోయే పండుగల దృష్ట్యా డివిజన్ వ్యాప్తంగా 24/7 పటిష్ఠ బందోబస్తు, వాహన తనిఖీలు చేపట్టాలని సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ లో ఇద్దరు అనుమానితుల అరెస్ట్..

## రూ.1.50 లక్షల విలువైన సెల్ ఫోన్లు స్వాధీనం



**వరంగల్, ఆగస్టు 12 : :** వరంగల్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో గూగుల్ పిక్సెల్–9 మొబైల్ ఫోన్ కూడా ఉంది.పోలీసుల వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో వరంగల్ జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ రాము, ఆర్‌పీఎఫ్–సీఐబీ హెడ్ కానిస్టేబుల్ ఎన్.రమేష్, వరంగల్ ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ పి.దుర్గాప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాస్ కలిసి వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్లు 2, 3 వద్ద న్యూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో తనిఖీలు నిర్వహించారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు విచారించారు. వారు మాదిగ అరవింద్ (19), కోట జంపయ్య (26)గా గుర్తించారు. పోలీసుల విచారణలో ఈ నెల 9న రాత్రి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక గూగుల్ పిక్సెల్–9 మొబైల్ ఫోన్‌ను దొంగిలించినట్లు, ఇతర రైళ్లలో మరో రెండు మొబైల్ ఫోన్లు కూడా దొంగిలించినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.వారి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లను పంచుల సమక్షంలో ఒప్పుకోలు, స్వాధీన పంచనామా ద్వారా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్ల మొత్తం విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.అనంతరం ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం రైల్వే మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని ఖమ్మం జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



# పాఠశాలల్లో 'ప్రతిజ్ఞ' రచయిత పైడిమర్రి సుబ్బారావు

## నేడు పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతి

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015–16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం

**తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ, 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీ టర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.**



భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటీష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్య మాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరే కించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్ర హులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుల య్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యా గ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసు కున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జాతీయ గీతం జనగణమన



**భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలని... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియదు.**

నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. జనగణమన గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. 1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్ళు పాడుకునే వారు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. దేశభక్తి గేయమైన జనగణమన బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది

1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది... 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించా లంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఈసారి హాకీ పోరు కొత్తగా!

- ప్రపంచకప్‌లో పూర్తిగా మారిన ఫార్మాట్
- క్వార్టర్ ఫైనల్స్‌కు స్వస్తి.. మూడంచెల విధానం
- 16 జట్లతో ఈ నెల 15 నుంచి మెగా సమరం
- 51 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించేందుకు భారత్ సిద్ధం



**న్యూఢిల్లీ, ఆగస్టు 12(చురకలు):** ప్రతిష్ఠాత్మక పురుషుల హాకీ ప్రపంచకప్ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. 51 ఏళ్లుగా అందని ప్రపంచకప్ టైటిల్‌ను మరోసారి ముద్దాడాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో ఈసారి పోటీ విధానాన్ని పూర్తిగా మార్చడం ఆసక్తి రేపుతోంది. గత ప్రపంచకప్‌లలో ఉన్న సంప్రదాయ క్వార్టర్ ఫైనల్స్‌ను తొలగించి, మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నెల 15 నుంచి 30 వరకు జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు పాల్గొంటాయి. నాలుగేసి జట్ల చొప్పున వాటిని ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించారు. భారత్ గ్రూప్-డిలో ఇంగ్లండ్, పాకిస్థాన్, వేల్స్‌తో తలపడనుంది. ఈ నెల 15 నుంచి 20 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగుతాయి. నాలుగు గ్రూపుల్లోని జట్లు తమ గ్రూపులోని మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు రెండో దశకు అర్హత సాధిస్తాయి. అయితే మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల పోరు అక్కడితో ముగియదు. అవి కూడా తదుపరి వర్గీకరణ దశలో కొనసాగుతాయి.

### రెండో అంచె.. క్రాస్ ఓవర్ రౌండ్

ఈ నెల 21 నుంచి 24 వరకు రెండో దశ పోటీలు జరుగుతాయి. తొలి దశ ఫలితాల ఆధారంగా జట్లను ఈ, ఎఫ్, జీ, హెచ్ పూల్స్‌గా విభజిస్తారు.

**పూల్-ఈ:** గ్రూప్-ఎ, గ్రూప్-డిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు.

**పూల్-ఎఫ్:** గ్రూప్-బి, గ్రూప్-సిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు.

**పూల్-జీ:** గ్రూప్-ఎ, గ్రూప్-డిలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు.

**పూల్-హెచ్:** గ్రూప్-బి, గ్రూప్-సిలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు.

ఈ దశలో ప్రతి జట్టు తొలి రౌండ్‌లో ఎదుర్కోని ప్రత్యర్థులతో తలపడుతుంది. ఇక్కడ మరో కీలక నిబంధన ఉంది. తొలి దశ నుంచి ముందుకు వచ్చిన జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సాధించిన పాయింట్లు రెండో దశకు కూడా కొనసాగుతాయి. ఉదాహరణకు గ్రూప్-డిలో భారత్ ఇంగ్లండ్‌ను ఓడించి, ఆ రెండు జట్లూ తొలి రెండు స్థానాల్లో నిలిచి పూల్-ఈకు చేరితే.. ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన పాయింట్లు రెండో దశలోనూ లెక్కలోకి వస్తాయి. దీంతో ప్రతి గ్రూప్ మ్యాచ్ అత్యంత కీలకంగా మారనుంది.

### క్వార్టర్స్ లేవు.. నేరుగా సెమీస్

కొత్త ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన మార్పు ఇదే. సంప్రదాయ క్వార్టర్ ఫైనల్స్ ఉండవు. రెండో దశలో పూల్-ఈ, పూల్-ఎఫ్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు నేరుగా సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మిగతా జట్లు ఐదు నుంచి 16వ స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడతాయి. ఈ నెల 27, 28 తేదీల్లో సెమీ ఫైనల్స్, వర్గీకరణ మ్యాచ్‌లు జరగనున్నాయి. పూల్-ఈలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు పూల్-ఎఫ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడుతుంది. పూల్-ఎఫ్ అగ్రస్థాన జట్టు పూల్-ఈ రెండో స్థానంలోని జట్టుతో మరో సెమీఫైనల్లో పోటీపడుతుంది. ఆగస్టు 30న ప్రపంచకప్ ఫైనల్ జరగనుంది. సెమీ ఫైనల్స్‌లో విజయం సాధించిన రెండు జట్లు విశ్వవిజేతగా నిలిచేందుకు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అంతకుముందు సెమీస్‌లో ఓడిన జట్ల మధ్య కాంస్య పతక పోరు జరుగుతుంది. భారత్ చివరిసారిగా 1975లో ప్రపంచకప్‌ను గెలుచుకుంది. అప్పటి నుంచి మరోసారి విశ్వవిజేతగా నిలవాలన్న కల నెరవేరలేదు. ఈసారి కొత్త ఫార్మాట్‌లో ప్రతి మ్యాచ్, ప్రతి పాయింట్ కీలకంగా మారనున్న నేపథ్యంలో.. 51 ఏళ్ల నిరీక్షణకు తెరదించి భారత జట్టు మళ్లీ ప్రపంచ హాకీ శిఖరాన్ని అధిరోహిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల




భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది. అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు




టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతే సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపాయలను కుమ్మరించనుంది. సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



# పదేళ్ల ప్రేమకు పెళ్లి ముద్ర

- జార్జినా రోడ్రిగేజ్‌ను వివాహమాడిన ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో
- పోర్చుగల్‌లోని కాస్కైస్‌లో నిరాడంబరంగా వివాహ వేడుక
- ఉంగరాలు మార్చుకుని అధికారికంగా ఒక్కటైన ప్రేమజంట
- వేడుకలో రొనాల్డో ఐదుగురు పిల్లల సందడి

**లిస్బన్, ఆగస్టు 12:** పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ఓ ఇంటివాడయ్యాడు. దాదాపు పదేళ్లుగా తనతో కలిసి జీవిస్తున్న ప్రేయసి జార్జినా రోడ్రిగేజ్‌ను వివాహం చేసుకున్నాడు. పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కు సమీపంలోని సముద్రతీర పట్టణం కాస్కైస్‌లో మంగళవారం వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది. దీంతో సుదీర్ఘకాలంగా ప్రేమబంధంలో ఉన్న రొనాల్డో, జార్జినా అధికారికంగా భార్యాభర్తలయ్యారు. అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకకు రొనాల్డో ఐదుగురు పిల్లలు కూడా హాజరయ్యారు. వివాహం అనంతరం రొనాల్డో, జార్జినా తమ ఉంగరాలను చూపిస్తూ తీసుకున్న చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. రొనాల్డో, జార్జినా ప్రేమకథ 2016లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో మొదలైంది. అక్కడి ఓ గూచీ దుకాణంలో పనిచేస్తున్న సమయంలో జార్జినాకు రొనాల్డో పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారి దాదాపు పదేళ్లుగా ఇద్దరూ కలిసి జీవిస్తున్నారు. 2025 ఆగస్టు 11న తమ నిశ్చితార్థాన్ని ప్రకటించిన ఈ జంట.. సరిగ్గా ఏడాది తర్వాత 2026 ఆగస్టు 11న వివాహబంధంతో ఒక్కటైంది. 41 ఏళ్ల రొనాల్డో ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఐదుసార్లు ప్రతిష్ఠాత్మక బాలన్ డి'ఓర్ పురస్కారాన్ని అందుకున్న అతడు.. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. మైదానంలో రికార్డులతో ప్రపంచాన్ని అలరించిన రొనాల్డో.. ఇప్పుడు పదేళ్ల ప్రేమబంధానికి పెళ్లి ముద్ర వేసి జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు.



# టీటీ చాంపియన్‌గా రిద్ధి

- సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో తెలంగాణ ప్యాడ్లర్ సత్తా
- అండర్-14 బాలికల సింగిల్స్‌లో టైటిల్ కైవసం

**హైదరాబాద్:** సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ క్రీడాకారిణి రిద్ధి తోరో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలికల సింగిల్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా అవతరించింది. బండ్లగూడ జాగీర్‌లోని టైమ్స్ స్కూల్‌కు చెందిన రిద్ధి ఫైనల్లో విజయవాడకు చెందిన హేత్వికపై 3-1 తేడాతో విజయం సాధించింది. తొలి గేమ్‌ను 7-11తో కోల్పోయిన రిద్ధి ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. వరుసగా 11-9, 11-8, 11-5తో మూడు గేమ్‌లను సొంతం చేసుకుని టైటిల్‌ను కైవసం చేసుకుంది. బాలికల అండర్-14 టీమ్ విభాగంలోనూ రిద్ధి ప్రతిభ కనబరిచింది. రిద్ధి తోరో, వంశిక, అనన్యతో కూడిన టైమ్స్ స్కూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

**నటి సమంత**



నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# మళయాళంలోనూ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీ వసంత్




కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక్-టు-బ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇది గనుక అధికారికంగా ఖరారైతే రామ్ చరణ్ ? రుక్మిణీల ఫస్ట్ కాంబినేషన్‌గా ఇది సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయం. భాషతో సంబంధం లేకుండా లక్కీ చార్మ్‌గా మారిన రుక్మిణీ వసంత్ రాబోయే రోజుల్లో సౌత్ లేడీ సూపర్ స్టార్‌గా నిలిచినా ఆశ్చర్యం లేదంటున్నారు సినీ విశ్లేషకులు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

**జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం**



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరపున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

**డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్**

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

This newspaper is Owned and Published by MOHAMMED IMRAN from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by MOHAMMED IMRAN and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. RNI REGD NO. TELTEL/2006/16536. Contact No.+91 9848999998, editor@churakalu.com